నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
ఆదివారం
28.4.2024



## ఆధునిక రవాణా మార్గాలకు చిహ్నాలు

# మన రైల్వేలు

## ఛైర్మన్‌తో ముఖాముఖి



నూకారపు సూర్యప్రకాశరావు
చైర్మన్, నేటి దిన పత్రిక సూర్య

**గత నెలలో ఏపి సర్కారు వ్యవహరించిన కారణంగా పించన్ల పంపిణీలో అనేక ఆందోళనలు జరిగాయా. అసలు వాలంటరీ వ్యవస్థ ఉంటేనే పించన్లు పంపిణీ అనే అభిప్రాయానికి వచ్చేలా సిఎస్ వ్యవహరించారన్న ఆరోపణలూ ఉన్నాయి. చాలా మంది వృద్ధులు పించన్ల కోసం వచ్చి మృత్యువాత పడిన ఘటనలూ చూసాం. ఈ క్రమంలో ఈ సారైనా పించన్ల పంపిణీ సక్రమంగా జరుగుతుందని భావించవచ్చా సార్.**

**మణిశంకర్ వాడ్రేవు, విశాఖపట్నం**

మీరన్నది నిజమే మణిగారూ... ఆంధ్రప్రదేశ్‌లో పింఛన్ల పంపిణీకి సంబంధించి కేంద్ర ఎన్నికల సంఘం సీఎస్ జవహర్ రెడ్డికి కీలక ఆదేశాలు ఇచ్చింది. వృద్ధులకు పింఛన్ల పంపిణీలో ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడాలని ఆదేశించారు. గతంలో పింఛన్ల పంపిణీ విషయంలో చాలా ఫిర్యాదులు వచ్చాయని గుర్తు చేసిన ఈసీ.. గతంలో ఇచ్చిన ఆదేశాలను కచ్చితంగా పాటించాలని సూచించింది. ఇంటింటికి పింఛన్లు పంపిణీ చేయాలని.. కుదరని పక్షంలో డీబీటీల రూపంలో చెల్లించాలని తెలిపింది. గతంలో ప్రభుత్వ ఉద్యోగులను పింఛన్ల పంపిణీకి ఉపయోగిం చుకోవాలని ఎన్నికల సంఘం సూచించింది.

ఎన్నికల కోడ్ అమలు దృష్ట్యా లబ్ధిదారులకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరింది. పింఛన్ సహా నగదు బదిలీ పథకాలకు అనుసరించాల్సిన మార్గదర్శకాలను మార్చి 30న జారీ చేసినట్లు వెల్లడించింది. ఆ మార్గదర్శకాలను వాస్తవిక దృష్టితో ఆలోచించి అమలు చేయాలని సీఎస్ జవహర్‌రెడ్డికి తేల్చిచెప్పింది. పంపిణీకి శాశ్వత ఉద్యోగులను వినియోగించుకోవాలని స్పష్టం చేసింది. పింఛన్ల ఇంటింటి పంపిణీకి వాలంటీర్లకు ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ ఉద్యోగులను వినియోగించుకోవాలని ఈసీ ఆదేశించింది. ఏప్రిల్ మొదటి వారంతో పోలిస్తే రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. మే మొదటి వారానికి 46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఎండలకి, వేడిగాలులకి జనాలు బయటకు రాలేని పరిస్థితి. ఈ ఎండల్లో పెద్దవాళ్లు రెండు, మూడు కిలోమీటర్లు వెళ్లి సచివాలయాల వద్ద పింఛన్లు తీసుకోవడమంటే ఇబ్బందిగా ఉందంటున్నారు. సకాలంలో డబ్బు సిద్ధంగా ఉంచుకోవడంతో పాటు, ఇంటింటికీ పంపిణీ జరిగేలా చర్యలు చేపడితేనే లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా, అంతా సజావుగా సాగే అవకాశం ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ప్రముఖ బ్యాంకుల్లో యెస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ వంటివి సేవింగ్స్ అకౌంట్ ఛార్జీల్ని సవరించిన సంగతి తెలిసిందే. ఇంకా కొన్ని క్రెడిట్ కార్డులకు సంబంధించి కొత్త రూల్స్ కూడా మే 1 నుంచి అమల్లోకి రాబోతున్నాయి. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్పెషల్ ఎఫ్‌డీలో డిపాజిట్ చేసేందుకు గడువు కూడా ముగుస్తోంది. ఇప్పుడు 2024 మే నెలలో రాబోతున్నటువంటి ఆర్థిక పర మార్పుల గురించి కాస్త చెప్పండి**

**మాగంటి విజయరాజశేఖర్, హైదరాబాద్**

అవును కొన్ని బ్యాంకులలో మే 1 నుంచి నిబంధనలు మారుతున్న మాట వాస్తవం. ఆ బ్యాంకులలో ఉన్న సేవింగ్స్ ఖాతాలపైనా చార్జీలు వేసేందుకు తీసుకున్న నిర్ణయాలు మీ జేబుకు చిల్లు పడేలా కూడా చేయొచ్చు. ముఖ్యంగా సేవింగ్స్ అకౌంట్లపై ఛార్జీల గురించి తెలుసుకోవడం వల్ల జాగ్రత్త పడొచ్చు. క్రెడిట్ కార్డులు కొన్ని రివార్డ్ పాయింట్లు తొలగించడం సహా రెంట్ పేమెంట్లపై సర్ ఛార్జీలు వసూలు చేస్తున్నాయి. ఇవి కూడా తెలుసుకోవాలి. స్పెషల్ ఎఫ్‌డీల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా మంచి రిటర్న్స్ పొందే అవకాశం మిస్ అవుతారు. ఆ మార్పులేంటో చూద్దాం.

చాలా బ్యాంకులు ప్రస్తుతం ఫిక్స్‌డ్ డిపాజిట్లపై అధిక వడ్డీ ఆఫర్ చేస్తూ స్పెషల్ ఎఫ్‌డీ స్కీమ్స్ తీసుకొచ్చిన విషయం తెలిసిందే. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కూడా స్పెషల్ సీనియర్ సిటిజెన్ కేర్ ఎఫ్‌డీ గతంలో తీసుకురాగా.. దీంట్లో డిపాజిట్‌కు ఆఖరి తేదీ 2024, మే 10 గా ఉంది. సీనియర్ సిటిజెన్ల కోసమే ప్రత్యేకంగా ఈ స్కీమ్‌ను 2020 మేలో లాంఛ్ చేసింది.

భారత్‌లో రెండో అతిపెద్ద ప్రైవేట్ బ్యాంక్.. ఐసీఐసీఐ బ్యాంక్ సేవింగ్స్ అకౌంట్లపై కొత్త ఛార్జీల్ని ప్రకటించింది. ఇది కూడా మే 1 నుంచే అమలవుతుంది. డెబిట్ కార్డులపై వార్షిక రుసుము కింద రూ. 200 చొప్పున వసూలు చేయనుంది. గ్రామీణ ప్రాంతాల్లో రూ. 99 గా ఉంది. చెక్ బుక్స్ విషయంలో ఏడాదిలో 25 చెక్ లీవ్స్ ఫ్రీ కాగా.. ఆపైన ఒక్కో లీవ్‌పై రూ. 4 పడుతుంది. అకౌంట్ క్లోజర్‌కు ఛార్జీల్లేవ్. సిగ్నేచర్ అటెస్టేషన్ కోసం రూ. 100 చెల్లించాలి. స్టాప్ పేమెంట్ ఛార్జీలు- నిర్దిష్ట చెక్స్‌కు రూ. 100 చొప్పున పడుతుంది.

ດດ మరో ప్రముఖ ప్రైవేట్ బ్యాంక్ అయిన యెస్ బ్యాంక్ కూడా సేవింగ్స్ అకౌంట్ ఛార్జీల్ని సవరించిన సంగతి తెలిసిందే. ఇది కొన్ని సేవింగ్స్ అకౌంట్లను నిలిపివేసింది కూడా. కనీస బ్యాలెన్స్ విషయానికి వస్తే సేవింగ్స్ అకౌంట్ ప్రో మ్యాక్స్ దాంట్లో రూ. 50 వేలు నిల్వచేయాలి. లేకుంటే గరిష్టంగా రూ. 1000 ఛార్జీ పడుతుంది. సేవింగ్స్ అకౌంట్ ప్రో ప్లస్ అయితే రూ. 25 వేలు మినిమం మెయింటెయిన్ చేయాలి. లేకుంటే గరిష్టంగా రూ. 750 పడుతుంది. సేవింగ్స్ అకౌంట్ ప్రోలో రూ. 10 వేలు కనీసం ఉండాలి. ఛార్జీ రూ. 750 గా ఉంది.

దీంట్లో డెబిట్ కార్డు యాన్యువల్ ఫీజు ఎక్కువగానే ఉంది. ఎలిమెంట్ డెబిట్ కార్డు వార్షిక రుసుము రూ. 299 గా ఉంది. ఎంగేజ్ డెబిట్ కార్డు వార్షిక ఫీజు రూ. 399 కాగా.. ఎక్స్‌ప్లోర్ డెబిట్ కార్డు రుసుము రూ. 599 గా ఉంది. రూపే డెబిట్ కార్డు (కిసాన్ అకౌంట్) రూ. 149 గా ఉంది. ఏటీఎంల్లో అయితే మొదటి 5 ట్రాన్సాక్షన్లకు ఛార్జీలు ఉండవు. ఆపై ప్రతి ట్రాన్సాక్షన్‌పై రూ. 21 చెల్లించాలి. ఇవన్నీ పరిగణలోకి తీసుకోండి

## లెజెండ్

# త్యాగానికి ప్రతిరూపం త్యాగరాయ శెట్టి



మద్రాసులోని టి.నగర్ పేరు తెలియని వారుండ రేమో. భారత స్వాతంత్ర్యం సాధించడానికి మ్నుందు , మద్రాస్ ప్రెసిడెన్సీగా, 1947 ఆగస్టు 15 న మద్రాస్ ప్రావిన్స్ గా, 1950 జనవరి 26 న భారత ప్రభుత్వం దీనిని మద్రాస్ రాష్ట్రంగా ఏర్పాటు చేయబడింది.

1950 లో రాష్ట్రంగా ఏర్పడిన సమయంలో, ప్రస్తుత తమిళనాడు మెంత్తం, కోస్తా ఆంధ్ర, రాయలసీమ, ఉత్తర కేరళలోని మలబార్ ప్రాంతం, దక్షిణ కేరళ లోని బళ్లారి ఇందులో భాగంగా ఉండేవి. 1857నాటికి మద్రాసు, కలకత్తా, బొంబాయిలో విశ్వవిద్యాలయాలను ఇంగ్లీషు వారు స్థాపించారు. పాలనా వ్యవహారాలు, రాజకీయ కార్యకలాపాలకు మదరాసు కేంద్రంగా ఉండడం తెలుగు ప్రాంతం అధికంగా మద్రాసు రాష్ట్రంలో అంతర్భాగం కావడం, సాహిత్యం, సినిమా తదితర రంగాలకు మదరాసు ప్రాంతంతో విడదీయరాని సంబంధం ఉండేది. అందుకేనేమో నాటి అపరాధ పరిశోధన రచనలలో (డిటెక్టివ్ నవలలు) మదరాసు, టి.నగర్ ఎక్కువగా చోటు చేసుకునేది. సినీ పరిశ్రమ కేంద్ర స్థానమైన మదరాసులో దక్షిణాది సినీ తారల సినీ తారల చిరునామాలకు సుపరిచిత మైన పేరు టి. నగర్. ఆ పేరు ఎలా వచ్చిందో నేటితరం చాలా మందికి తెలియదు. టి.నగర్ అంటే త్యాగరాయ నగర్. జస్టిస్ పార్టీ తొలి అధ్యక్షులు, మద్రాసు మాజీ మేయర్ సర్ పిట్టి త్యాగరాయ శెట్టి పేరు మీద వెలసినదే టి. నగర్.

త్యాగరాయ శెట్టి మద్రాస్ నగరంలో ఎగత్తూర్ లో 27-4-1852 ఎప్రిల్ 27న న తెలుగు సంపన్న దేవాంగ కుటుంబంలో జన్మించిన చేనేత ముద్దు బిడ్డ. స్వాతంత్ర్యానికి పూర్వమే మద్రాస్ ప్రెసిడెన్సీ కి ముఖ్యమంత్రి అయ్యే అవకాశాన్ని నైతిక విలువలకు కట్టుబడి తిరస్కరించిన వీరిది మహోన్నత వ్యక్తిత్వం ఆయనది. త్యాగాలతో నైతిక విలువలతో జీవితమంతా ప్రజా సేవలోనే గడిపిన త్యాగశీలి. త్యాగరాయ శెట్టి గారు ప్రసిద్ధ న్యాయవాది, ప్రముఖ పారిశ్రామికవేత్త, గొప్ప రాజకీయ వేత్త , మూడు రంగాలను చక్కగా సమన్వయం చేసుకుంటూ ప్రజాసేవలో పునీతులు అయ్యారు.

మద్రాస్ నగరంలోనే ప్రాథమిక మరియు ఉన్నత విద్యనభ్యసించి 1873 లో న్యాయ శాస్త్రంలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 1882 నుండి1922 వరకు 40 సంవత్సరాల పాటు మద్రాసు ప్రెసిడెన్సీ కార్పోరేషన్ మెంబర్ గాను చివర మూడు సవంత్సరాలు మేయర్ గాను అత్యంత సమర్థవంతంగా, ప్రజా సేవే లక్ష్యంగా పనిచేశారు.

విద్య అభివృద్ధి కొరకు 1897 లో నార్త్ మద్రాస్ హిందూ హైస్కూల్ స్థాపించారు. అంచెలంచెలుగా అభివృద్ధి చెంది1950 నాటికి త్యాగరాయ కళాశాలగా రూపు దిద్దుకుంది. సౌత్ ఇండియా ఛాంబర్ ఆఫ్ కామర్స్ వ్యవస్థాపకుల్లో ఒకరు.1910 నుండి 1921 వరకు ప్రెసిడెంట్ గా పని చేశారు. 1919 లో దివాన్ బిరుదుతో పాటు 1921లో సర్ బిరుదు వరించింది.త్యాగరాయ శెట్టి మొదట కాంగ్రెస్ వాది. క్రియాశీలక నాయకులు. తరువాత జస్టిస్ పార్టీ కి మొదటి అధ్యక్షులు. మరణించే వరకు జస్టిస్ పార్టీ అధ్యక్షుడిగా పని చేశారు. పెరియార్ రామస్వామి నాయకర్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడయ్యాక జస్టిస్ పార్టీని పేరు మార్చి "ద్రవిడ కజగం"గా మార్చారు. అందులోంచే డియంకె, అన్నా డియంకె పుట్టాయి. జస్టిస్ పార్టీ ఆశయాలకు , ద్రవిడ కజగం, డియంకె, అన్నా డియంకె లకు స్ఫూర్తిదాత త్యాగరాయ శెట్టి.

బడుగు బలహీన, అట్టడుగు వర్గాల శ్రేయస్సు లక్ష్యంగా, పెత్తందారీ ఆధిపత్యాన్ని నిరసిస్తూ సి.నటేషన్ మొదలియార్, డాక్టరు టి.ఎం. నాయర్ మరి 30 మంది, ప్రముఖులతో కలిసి జస్టిస్ పార్టీని స్థాపించారు.

1920 లో అయన నాయకత్వం లోనే జస్టిస్ పార్టీ 98 సీట్లకు గాను 63 సీట్లు గెలిచి, అఖండ విజయం విజయం సాధించింది. మద్రాస్ రాష్ట్రానికి ముఖ్య మంత్రిగా త్యాగరాయ శెట్టిని నాటి మద్రాస్ ప్రెసిడెన్సి గవర్నర్ వెల్లింగ్టన్ ఆహ్వానించారు. అయితే త్యాగరాయ శెట్టి నైతిక విలువలకు కట్టుబడి రాజకీయ పార్టీ అధిపతి క్యాబినెట్ లోను కూడా పదవిలో ఉండకూడదన్న "నైతిక కారణంగా" నిరాకరించారు.

దక్షిణాది ప్రజలు ఆదరించి అభిమానించే ప్రజా సేవకుడు ప్రజా నాయకుడు. జీవితమంతా చేనేత ఉద్యమాలకు చేనేత సంఘాలకు చేనేత విద్యార్థులకు విరివిగా విరాళాలు ఇచ్చి సహాయం చేసి, చేనేతను ప్రోత్సహించారు.

సర్ పిట్టి త్యాగరాయ శెట్టి ఏప్రిల్ 28,1925 న తుది శ్వాస విడిచారు. 40 సంవత్సరాల వీరి నిస్వార్థ సేవకు గుర్తింపుగా కార్పొరేషన్ కార్యాలయం ముందు త్యాగరాయ శెట్టి విగ్రహం ప్రతిష్ఠించారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల...**
**9440595494**

## నవ కవిత్వం
### మొబైల్ ఫోన్



ఈ చరాచర జగత్తును
అరచేతిలో వుంచి
అంతర్జాలం వేదికగా అద్భుతాలు
చేస్తున్న మనసుల బ్రహ్మావాణి
మనిషిని అన్నీ తానై నడిపిస్తున్న
మాటలమారి ఆకాశవాణి
నేటి ఆధునిక ప్రపంచపు అక్షరాల
ఆత్మకు రాణి ఈ చరవాణి..!!

విశ్వ హద్దులను దాటేస్తూ
మన మనుగడను శాసిస్తూ
అణువు లోని బ్రహ్మాండంలా
మంచి,చెడులనే పార్శ్వాలు గా కల్గిన
మన జీవితపు కొలమాని
ఈ చరవాణి..!

రింగ్ మంటూ టోన్ కదిలితే
ప్రేమికుల గుసగుసలు
వినిపిస్తున్నాయి
భార్యభర్తల భావాల పదనిసలు
పరవళ్ళుతొక్కుతున్నాయిజి
అమ్మ ఎదురుచూపులోని
చిరునవ్వులు ఉలిక్కిపడుతున్నాయి
నాన్న ఆందోళనలోని ఆలోచనలు
ఉప్పెనలా ఎగిసిపడుతున్నాయి
బంధాల తాలూకు
ఘుమఘుమలాడే
స్వప్నాలన్నీ మన గుమ్మం ముందే
గుడిగంటల్లా మోగుతున్నాయి
ట్విట్టర్ కూత
వాట్సాప్ మోత
ఫేస్ బుక్ రాత
ఇలాంటి యాప్ లన్నీ
యాపిల్ పండ్లలా కంటిలోని
జ్ఞాన నోటికి తియ్యగా కనిపిస్తుంటే
చరవాణే జీవన సంకేతం..!
చరవాణే బ్రతుకు సంగీతం..!
చరవాణే స్నేహపు సాహిత్యం..!!
చరవాణే కుల,మత,ప్రాంత రహిత
మానవతపు సందేశం..!!

**ఫిజిక్స్ అరుణ్ కుమార్**
**9394749536**

## లేఖలు

**ముఖచిత్ర కథనం బాగుంది**

ఆదివారం అనుబంధంలో ఉక్రెయిన్ యుద్ధంలో భారతీయ యువకులు పాల్గొనటాన్ని కళ్లకు కట్టినట్టు చూపించిన రచయిత వివి రావుగారికి ధన్యవాదాలు. ఈ కథనం దేశంలో పెరుగుతున్న నిరుద్యోగానికి ప్రతీకగా నిలుస్తుందనటంలో సందేహంలేదు. మాకు ఇంతవరకు తెలియని ఎన్నో అంశాలను ప్రస్తావిస్తూ వివరణాత్మకంగా రచించిన సీనియర్ జర్నలిస్టు వివి రావుగారికి ధన్యవాదాలు. ప్రత్యేక వ్యాసం ప్రచురించిన సంపాదక వర్గానికి, సూర్య యాజమాన్యానికి ధన్యవాదాలు. ఈ తరహా మరిన్ని వ్యాసాలు ప్రచురించాలని కోరుకుంటున్నాం. ప్రచురించిన ఎడిటర్, యాజమాన్యాలకు ధన్యవాదాలు. సందర్భాను సారంగా మన పత్రికలో ప్రత్యేక వ్యాసా లు రాయించి ప్రచురిస్తున్న మీకు, సంపాదక వర్గానికి కృతజ్ఒతలు. తెలుగు భాషపైనా ఓ ప్రత్యేక కాలమ్ నిర్వహిస్తే బాగుంటుంది. భాషను మర చిపోయి బావ దారిద్రంలో ఉన్న వారికి ఉపయోగ పడుతుందని నా మనవి.

**– వారాంతపు రజనీ, వరంగల్**
**–బి మధుశేఖర్, హైదరాబాద్**




**సినిమా రివ్యూలు బాగున్నాయ్**

వారం వారం విడుదలవుతున్న చిత్రాలలో మంచి చెడ్డలను, నటీ నటులు, సాంకేతిక నిపుణుల పనితీరును అర్ధవంతంగా వివరి స్తున్న విశ్లేషకులకు ధన్యావాదా లు. ప్రధానంగా ధియేటర్లలోకి రాకుండా ఓటిటికే పరిమితమవు తున్న సినిమా లపైనా విశ్లేషణలే చేస్తుండటం హర్షించదగ్గది.

**– ముక్కామలపద్మావతి, హైదరాబాద్**

**కథలు బాగున్నాయి**

వారం వారం ప్రచురిస్తున్న కథలు బాగున్నాయి కొత్త రచయితలకు మీరందిస్తున్న ప్రోత్సాహం బాగుం ది. . రచిత కథనా న్ని బాగా నడిపిస్తున్నారు. మంచి రచ నలు అందిస్తున్న మీకు ధన్యవా దాలు

**–శ్రీవల్లి తన్మయ్, హైదరాబాద్,**

## ఏది శాశ్వతం?



జీవితం ఓ కాల నిడివి
భూలోకము దానికి ఓ విడిది
కాలాన్ని బట్టి ఋతువులు
ఋతువులను బట్టి పరిస్థితులు!

శిశిరం వచ్చిపోయాకే కదా
చిగురించే వసంతం వచ్చేది
రాలిన ఆకు ఇస్తుంది
కొత్త ఆకు పుట్టుకకు అవకాశం!

కళ్ళల్లో అవే నీళ్ళు
ఆనందమైనా ఆవేదనైనా
భావాలలో అనుభవాలలో తేడా
స్పందించే హృదయం ఒకటే!

మధురమైన మామిడిలో
అమృతమయమైన రసాధార
తొక్కా పిక్క కలిసి ఉంటుంది
సృష్టి సమ దృష్టితో ఉంటుంది!


అంతా ఒక్కటే అంటే అద్వైతం
కాదు కాదు అంటే ద్వైతం
ద్వైత అద్వైతాలు ఆలోచనా తీరులే
అక్షరీకరించిన విధానాలే!


రాత్రీ పగలు రోజుకు
ఉండే రెండు పార్శ్వాలే
అమావాస్య పున్నమిలు
మాసానికి అటు ఇటులే!

ఒకటి లేకుండా రెండవది
అడుగు వేయకుండా బాటను
ఆరాటపోరాటాలు లేని జీవితం
అలుపు లేని గెలుపు ఉంటాయా!

ఏది శాశ్వతం?
మార్పు అనేది నిజం!
శ్వాస నిశ్వాసల మధ్య
నిలిచి ఉన్నదే జీవితం!!


**జగ్గయ్య.జి**
**9849525802**






సూర్య బుడత



బాలల కథ

# కప్ప గొప్పలు



నరసింహపురం గ్రామంలోని ఒక చెరువులో చేపలతో పాటు కొన్ని కప్పలు ఉండేవి. అందులో ఒక పెద్ద కప్ప చాలా గర్వం కలది . దాని పేరు దర్దురం. అది చాలా గొప్పలకు పోయేది. అది ఒకసారి చెరువులో గల చేపలతో " ఓ చేపలారా! నా గొప్ప తనం మీకు తెలియదు . నేను చాలా పాములను మ్రింగాను. నా పేరు చెబితేనే పాములన్నీ భయపడుతాయి. నన్ను చూస్తే అవి గజగజ వణుకుతాయి" అని అంది. అది విని చేపలన్నీ పకపక నవ్వాయి. దాంతో కప్పకు కోపం వచ్చి " నా మాటలు మీరు నమ్మడం లేదు కదూ! ఒక పాము ఇక్కడకు రానీ! అప్పుడు నా గొప్పతనం ఏమిటో మీరు చూస్తారు" అని అంది.


ఈ మాటలు విని పొదల్లో ఉన్న ఒక పాము ఆ చెరువు వద్దకు వచ్చింది. అప్పుడు కప్ప గుండెలో రాయిపడినట్లైంది . అయినా అది ధైర్యంగా " ఓ సర్పమా! నీకు ప్రాణం మీద ఆశ లేదా! నా చేతిలో నీకు ఈరోజు చావు తప్పదు "అని అంది . అది విని ఒడ్డున ఉన్న పాము కప్పను ఒడ్డు పైకి రమ్మంది. అప్పుడు ఆ కప్ప " ఈరోజు నాగుల చవితి. నిన్ను మింగితే నాకు పాపం . అందువల్ల రేపు రా! నీ సంగతి చూస్తాను "అని అంది . పాము నవ్వి వెళ్ళిపోయింది. చేపలు కప్ప మాటలు నిజమేనని అనుకున్నాయి.


ఆ తర్వాత మరొక రోజు పాము వచ్చి కప్పను ఒడ్డు పైకి రమ్మంది . అప్పుడు కప్ప" ఈరోజు సోమవారం. శివునికి ఇష్టమైన రోజు . శివుని మెడలో ఉండే నిన్ను ఈరోజు మ్రింగితే బాగుండదు. నాకు చాలా పాపం వస్తుంది. అందువల్ల రేపు రా! నీ సంగతి తెలుస్తాను "అని అంది. అప్పుడు కూడా పాము వెళ్ళిపోయింది


మరునాడు ఆ పాము మళ్లీ వచ్చింది. అప్పుడు ఇక చేపలన్ని ఆ కప్పను రెచ్చగొట్టాయి . ఇక కప్పకు ఆ పాము ముందుకు వెళ్ళక తప్పలేదు . అది ఒడ్డు పైకి వచ్చి గట్టిగా "ఓ సర్పమా! ఈరోజుతో నీకు మూడింది "అని అంది. అది విన్న పాము అమాంతంగా ఆ కప్పను పట్టుకుంది .

అప్పుడే ఆ చెరువులో గల తాబేలు అటువైపు వెళుతున్న తన మిత్రుడైన ముంగిసను రమ్మని పిలిచింది . ఆ ముంగిసను చూసిన పాము ఆ కప్పను వదిలిపెట్టి పారిపోయింది. చావుతప్పి కన్ను లొట్టబోయిన ఆ కప్ప తలవంచుకొంది. అప్పుడు తాబేలు " ఓ కప్పా! నీవు గొప్పలు మానుకో! సమయానికి ముంగిస రాకుంటే నీవు పాముకు ఆహారం అయ్యే దానివి . ఇకనైనా నీ బలం తెలుసుకొని ప్రవర్తించు "అని హితోపదేశం చేసింది . దాని మాటలకు చేపలన్ని 'ఔను,ఔను' అని అన్నాయి. ఆ కప్ప తనకు బుద్ధి వచ్చిందని చెబుతూ మరెన్నడూ గొప్పలకు పోలేదు.

– సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,
9908554535





| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 4 | 6 | | 1 | 7 | 5 | 2 | 3 | |
| 7 | 2 | 1 | 9 | 8 | | 5 | 6 | 4 |
| | 3 | | | | | 1 | 7 | |
| 2 | | | 4 | 1 | | 3 | 5 | |
| | | | | 3 | 9 | 8 | 4 | 6 |
| | | | | | | 9 | | 1 |
| | | | 5 | 6 | | | 9 | 2 |
| 6 | | 4 | | | | 7 | 8 | |
| 8 | | | | | | | | |

# ఆకాశాన్ని అంటుతున్న మామిడి ధరలు

## దళారి చేతిలో మోసపోతున్న మామిడి రైతులు



పండ్ల తోటల్లో మామిడి పంట చాలా ప్రముఖమైనది. అందుకే దీనిని పండ్లలో రారాజు అని పిలుస్తారు. మన భారతదేశంలో చాలా రకాల మామిడి వంగడాలు / రకాలు వివిధ ప్రాంతాలలో సాగవుతున్నాయి. కొన్ని వందల సంవత్సరాల నుండి ఈ పంటను సాగుచేస్తున్నారు. ప్రపంచంలోనే మామిడిని పండించడంలో మన దేశం ప్రథమ స్థానంలో ఉంది. ప్రపంచం మొత్తంలో సగం వరకు మామిడి ఉత్పత్తి మన భారత దేశంలో జరుగుతుంది. మామిడి పండులో అధిక పోషకాలు, విటమిన్-ఎ, సి, అలాగే మంచి రుచి ఉ ఒడడం వలన, చాలా మంది ప్రజలు ఈ పండును ఇష్టపడతారు. అలాగే మామిడిలో కొన్ని ఔషధ గుణాలు కూడా ఉన్నాయి. మామిడి పంటను చాలా మంది రైతులు ముఖ్యమైన ఉద్యాన వాణిజ్య వంటగా సాగుచేస్తున్నారు. మామిడిని మన ఉభయ తెలుగు రాష్ట్రాలలో ప్రధానంగా కృష్ణా, ఖమ్మం, విజయనగరం, పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి, శ్రీకాకుళం, కరీంనగర్, విశాఖపట్నం, చితూరు, కడప, అదిలాబాదు, నల్గొండ జిల్లాల్లో సాగుచేస్తున్నారు. మామిడిని పండించడానికి అన్ని రకాల నేలలు అనుకూలంగా ఉ ంటాయి. కానీ లోతైన నేలల్లో వేర్లు బాగా వ్యాపించి, చెట్టు అభివృద్ధి చెంది చాలా కాలం ఫలాన్నిస్తాయి. సంవత్సరంలో ఒకసారి వచ్చే మధురమైన పంట మామిడి పంట. వేసవిలో మామిడి పచ్చడి, ఊరగాయలు, మాగాయ, మామిడి పులిహోర మామిడి పండ్లు పండ్ల రసాలు తినడానికి ప్రతి ఒక్కరూ ఉవ్విళ్లూరుతుంటారు. ఈ సంవత్సరం కాపు సంతృప్తికరంగా లేదు, డిసెంబర్ జనవరి నెలల నుండి విపరీతమైన ఎండలు ఉండడంతో పూత నిలవలేదు. కాపు పూర్తిగా పలుచగా ఉంది. కొన్ని చోట్ల కాపు లేదు. గత నెల రోజులుగా హోల్ సేల్ మార్కెట్లో ధర 900 నుండి 1800 వరకు బాక్స్ కు ఉ ండటంతో సామాన్యుడికి అందుబాటులో లేని ధర. దళారీలు నెలకిందట తక్కువ ధరకు చెట్లు కొని ఎక్కువ ధరకు మార్కెటు కు తరలిస్తున్నారు. వర్షాలు పడకపోవడంతో మామిడి పండు రుచి ఉండటం లేదు. మార్కెటు కు వచ్చిన మామిడి కుత్రిమ పద్ధతిలో మాగ పెడుతున్నారు. కార్బైడ్, స్ప్రే చేయడం, అసిటిలిన్ ద్రావణంలో అద్దడంతో పండు మాధుర్యం కోల్పోయింది. కొన్ని చోట్ల పంట దెబ్బతీసింది, కోయకుండా చెట్టుపైన ఉన్న కాయలకు ఉజి ఈగ బెడద ఎక్కువగా ఉంది. నిండా కాపు ఉన్న చెట్టు కాయలు ఐదు వందల నుంచి ఏడు వందల వరకు వ్యాపారస్తులు పెడుతున్నారు. మూడు వందల చెట్లకు రెండు లక్షలు మించడం లేదు. సంవత్సర కాలం కంటికి రెప్పలా చూసుకున్న కాపలాదారుడు జీతానికి సరిపోయేటట్లు



ఉంది. రైతులకు పెట్టుబడి లేక చెట్లు తీసివేసే ప్రమాదం ఉంది. గత దశాబ్ద కాలంగా కోల్డ్ స్టోరేజ్ యూనిట్స్, ధాన్యం నిలువ చేసుకోవడానికి వేర్ హౌస్ లు లేక రైతులు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారు. ప్రతి ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం పనిచేస్తున్నట్లు ప్రకటిస్తున్నారు కానీ ఎక్కడా మార్కెట్ సౌకర్యం, సరకు నిల్వ సౌకర్యం, గిట్టుబాటు ధర, రవాణా సౌకర్యం కల్పించడంలో పూర్తిగా విఫలమైంది. వేరుశెనగ వేసుకుంటే గిట్టుబాటు లేదని పత్తికి మారి, పత్తికి గిట్టుబాటు లేదని, టమోటా, టమోటా నుండి మిర్చీ మిర్చీ నుండి ఫల సంప్రదాయం కి మారినా నష్టాలు మిన్నంటుతున్నాయి. దేనికి మారిన అదృష్టం మారక అప్పుల ఊబిలో కొట్టుకు పోతున్నారు. అది తెలంగాణ అయినా ఆంధ్రాలో అయినా రైతు గోస ఒక్కటే. అకాల వర్షాలకు పిందెలు, కాయలు రాలిపోయి చాలా చోట్ల ఇరవై కిలోల బాక్స్ మార్కెట్ ధర రెండు వేలు మార్కెట్ ధర. సహజంగా ఇంట్లో పండడానికి ఎక్కువ సమయం పడుతుంది అలాగే ఎక్కువ కాయలు కుళ్లిపోతున్నాయి సాధారణంగా మామిడి, అరటి, బొప్పాయి పళ్ళను పూర్తిగా పండకుండానే చెట్ల నుండి కోసి, తర్వాత వాటిని మగ్గ బెడతారు . సహజసిద్ధంగా పండటానికి ఎక్కువ సమయం పడుతుంది. సాధారణంగా పళ్ళను మగ్గ పెట్టడానికి ఎథ్రెల్ స్ప్రే చేయడం గానీ, వాటిని ఎథ్రెల్ ద్రవంలో ముంచడం గానీ చేస్తారు. అయితే అది శ్రమతో కూడిన పని. అదీకాక బయట అమ్మే ఎథ్రెల్ లో కల్తీ రసాయనాలు ఉంటే సమస్యలు వస్తాయి. దీనికి ప్రత్యామ్నాయంగా, పళ్ళను మగ్గబెట్టి గోదాములలో ఇథిలీన్ గ్యాస్ ఉపయోగిస్తారు. అయితే దీనికి ఎక్కువ పెట్టుబడి అవసరమవుతుంది. రైతులకు, చిన్న వ్యాపారులకు ఆర్థికంగా గిట్టుబాటు అవదు. కాబట్టి తక్కువ పెట్టుబడితో పళ్ళను మగ్గించడానికి ప్లాస్టిక్ టెంట్లలో ఇథలీన్ గ్యాస్ ను వదిలి పళ్ళను పండబెట్టడం రూపొందించారు. ఇతర ఉద్యాన పంటలలో లాగానే, మామిడిని కూడా చాలా రకాల పురుగులు ఆశించి నష్టాన్ని కలిగిస్తాయి. వాటిలో ప్రధానమైనవి తేనెమంచు పురుగు, టెంక పురుగులు, వండు ఈగ, పిండిపురుగులు. ఈ ప్రధాన పురుగుల వలన కలిగే నష్టం అపారం. ఎన్ని ఎత్తులు వేసి మార్కెట్టుకు కాయలు తరలించినా ఆరుగాలం శ్రమించిన రైతుకు దక్కేది శూన్యం, దళారులకు భోజ్యం. తక్షణం రైతులను ఆదుకొని రెండు రాష్ట్రాల వ్యవసాయ శాఖల మంత్రులు నిర్దిష్ట ప్రణాళికతో సత్వరమే మార్కెటు, నిల్వ సౌకర్యం, గిట్టుబాటు ధర కల్పించాల్సిన అవసరం ఉంది. ప్రజలకు మంచి ఫలాన్ని ఇచ్చి వారి ఆరోగ్యాన్ని కాపాడిన వారవుతారు.

**డా. యం. సురేష్ బాబు, 9989988912**

## మీ ఫోన్‌లో ఇంటర్నెట్ స్లోగా ఉందా..?

నేటి సాంకేతిక కాలంలో ఇంటర్నెట్ అనేది మనందరి జీవితంలో ఓ ముఖ్యమైన భాగంగా మారిపోయింది. నిద్రలేచింది మొదలు.. నిద్రపోయే వరకు నిత్యజీవితంలో అనేక పనులు ఇంటర్నెట్ ఆధారంగా మొబైల్‌తోనే చేస్తున్నాం. పాల ప్యాకెట్ దగ్గర నుంచి రెంట్ పే చేయడం, డబ్బు లావాదేవీలు, కొనడాలు, సినిమాలు, గేమ్స్ వంటి అనేక పనులు ఇంటర్నెట్ లేకుండా సాధ్యం కాదు. అయితే కొన్నిసార్లు ఇంటర్నెట్ వేగం సడెన్‌గా తగ్గిపోతుంది. దీంతో బ్రౌజింగ్, డౌన్‌లోడ్ సరిగా జరగదు. చాలా పనులు మధ్యలోనే ఆగిపోతాయి. ఈ పరిస్థితుల్లో మనం తీవ్ర ఆందోళనకు గురవుతాం. అయితే ఈ చిట్కాలను ఉపయోగించి ఇంటర్నెట్ వేగాన్ని పెంచుకోవచ్చు. అవేమిటంటే..

స్మార్ట్‌ఫోన్‌లన్నింటిలో 'ఫ్లైట్ మోడ్' ఆప్షన్ ఉంటుంది. దీని కోసం సెట్టింగ్స్‌లోకి వెళ్లి ఫ్లైట్ మోడ్‌ను ఆఫ్ చేసి.. కొద్దిసేపటి తర్వాత ఆన్ చేస్తే, మీ ఫోన్ ఇంటర్నెట్ పూర్తి వేగంతో పనిచేస్తోంది.

మీ ఫోన్ నెట్ స్పీడ్‌ని మెరుగుపరచడానికి మరొక సులభమైన మార్గం మ్బైల్ డేటా ఆప్షన్‌ను ఆఫ్ చేయడం. మీరు ఫోన్ డేటాను కాసేపు ఆఫ్ చేసి.. కొద్దిసేపటి తర్వాత రీస్టార్ట్ చేయడం ద్వారా మొబైల్ డేటా ఫుల్ స్పీడ్‌తో రన్ అవుతుంది.

సాధారణంగా ఇంటర్నెట్ స్పీడ్ నెట్వర్క్ టైప్‌ను బట్టి ఉంటుంది. 4జి నెట్‌వర్క్ ఉంటే ఇంటర్నెట్ స్పీడ్‌గా ఉంటుం ది. కొన్ని నెట్‌వర్క్ సరిగ్గా పని చేయవు. దీని కోసం మొదట ఫోన్ సెట్టింగ్స్‌లోకి వెళ్లి మొబైల్ నెట్‌వర్క్‌ను 4జికి ఎనేబుల్ చేయాలి. తర్వాత నెట్వర్క్ సెట్టింగ్స్‌కు వెళ్లి యాక్సెస్ పాయింట్ పేర్లపై క్లిక్ చేసి ఏపీఎన్ ను డిఫాల్ట్ గా రీసెట్ చేయాలి.



చాలా సందర్భాల్లో మొబైల్ నెట్‌వర్క్ సరిగ్గా రాకపోవడానికి కారణం మీ డివైజ్ లేటెస్ట్ అప్‌డేట్‌తో ఇన్‌స్టాల్ చేయకపోవడం కూడా కారణం కావచ్చు. అందువల్ల, ఫోన్ లేటెస్ట్ సాఫ్ట్‌వేర్‌తో అప్‌డేట్ అయ్యిందో లేదో చెక్ చేసుకోండి.

స్పీడ్ టెస్టులో మీ ఇంటర్నెట్ వేగం తక్కువగా ఉన్నట్లు తేలితే డిఎన్ఎస్ సర్వర్ మార్చుకోవడం ద్వారా వేగాన్ని పెంచుకునే అవకాశం ఉంటుంది.

క్రాష్, కుక్కీలను క్లియర్ చేయాలి. మొబైల్ ఫోన్ లో క్రాష్, కుక్కీలను క్లియర్ చేసుకోవాలి. ఇలా చేయడం వలన మీ ఇంటర్నెట్ బ్రౌజింగ్ వేగవంతం అవుతుంది.

డేటా సేవింగ్ మోడ్‌ని ఆన్ చేయాలి. ఫోన్ లో డేటా సేవింగ్ మోడ్ ను ఆన్ చేయడం కూడా ఇంటర్నెట్ వేగం పెంచుకునే అవకాశం ఉంటుంది.

బ్యాక్‌గ్రౌండ్ యాప్‌లను క్లోజ్ చేయాలి. ఒకేసారి చాలా యాప్‌లను రన్ కావడం వల్ల ఇంటర్నెట్ వేగం తగ్గే అవకాశం ఉంటుంది. ర్యాంని ఖాళీ చేయడం వలన ఇంటర్నెట్ వేగం పెరుగుతుంది. ఇందుకోసం బ్యాక్‌గ్రౌండ్ యాప్‌లను క్లోజ్ చేయాలి.

ఆటో-అప్‌డేట్‌లను నిలిపివేయాలి. ఆటోమేటిక్ అప్‌డేట్‌లు చాలా డేటాను తీసుకుంటాయి. దీని వలన ఇంటర్నెట్ వేగం తగ్గుతుంది. ఈ నేపథ్యంలో యాప్‌ల ఆటోమేటిక్ అప్‌డేట్‌లను ఆఫ్ చేయాలి.

ఈవారం కథ

# సగభాగం

ఈ రోజు మా పదో పెళ్లిరోజు. తల్చుకొంటేనే కళ్ళమ్మట నీళ్ళు గిర్రున తిరిగాయి.

"పెళ్లి రోజు శుభాకాంక్షలు డాడీ. స్కూల్ కి పోతున్నా . బై. మీ ఆనంద భాష్పాలతో రూమ్ నిండిపోయింది. ముందు కళ్ళు తుడుచుకోండి. " అంటూ తుర్రు మంది మా అమ్మాయి.

వెంటనే బుర్ర గిర్రున తిరిగి గతంలోకి జారుకొన్నాను.

ఏ లోకాన ఉన్నాడో, మా నాన్న... గుర్తుకు వచ్చాడు. ఆయన్ని వెర్రి నాగన్న అనుకొనేవాడిని కానీ ఎంత పొరపాటు.. ఆయన యోగి వేమన్నే. ఎంత ముందు చూపు?!

నాకు స్నేహితుడి లాగానే ఉండేవాడు. డిగ్రీ చదువుతుండగా, నాకు పెళ్లీడు వచ్చినట్టు ఫీలయ్యి ఓ రోజు అన్నాను.

"నాన్నా ! పెళ్ళి చేసుకొని ప్రేమించడం మంచిదా లేకపోతే ప్రేమించి పెళ్లి చేసుకోవడం మంచిదా ?."

"ఒరేయ్ : మెడకు రాయి కట్టుకొని చెర్లో దూకడం మంచిదా, చెరువులో దూకింతర్వాత రాయి కట్టుకోవడం మంచిదా అన్నటుంది రా నీ ప్రశ్న. పళ్ళూడగొట్టుకొంటానని డిసైడయ్యాక"

" సరిగా చెప్పు నాన్నా" అంటూ మారాం చేశాను.

"అయితే వినుకోరా ! పెళ్లి ఎలా ఎవరిని చేసుకున్నా ఒకటే . అయితే కోరి కోరి చదువు కున్న అమ్మాయి జోలికెళ్లొద్దు. మసై పోతావు."

" ఓహో ! అందుకనేనా అమ్మ చదువుకోకుండా జాగ్రత్త పడ్డావ్.

" మీ అమ్మ మూడో క్లాస్ చదివింది. మూడో క్లాస్ తోనే నన్ను ముప్పయ్ చెరువుల నీళ్ళు తాగించింది. ఇక నీయిష్టం" అప్రయత్నంగా గుడ్ల నీళ్ళు కుక్కుకున్నాడు.

బిత్తర పోతూ నసిగాను.

"అయినా ఈ కాలంలో అందం లేనివాళ్ళో, అణకువ లేని వాళ్ళో దొరకొచ్చు గానీ చదువు లేనోళ్ళు ఎక్కడ దొరుకుతారు నాన్న. అసలే కంప్యూటర్ యుగం. కాస్త ప్రాక్టికల్ గా ఆలోచించు"

" ఒరేయ్ అలా అయితే పెళ్ళి మానుకో. అదృష్టం ఈడ్చితంతే నాయకుడివైనా అవుతావ్ లేకపోతే ప్రశాంతంగా బ్రతకనైనా బ్రతుకుతావ్ "

అలిగినట్టు బుంగ మూతి పెట్టాను.

కాస్తా దిగొచ్చాడు. చివరికి భారంగా నిట్టూర్చి. బరువైన గొంతు తో చెప్పాడు.

" పోనీ తక్కువ చదువుకున్న అమ్మాయిని చేసుకోరా ! ఎలిజబెత్ యువరాణి ఎమ్మే., ఎల్లమ్మ ఎనిమిదో తరగతి, ఎదురయ్యారనుకో! ఎల్లమ్మనే చేసుకో, కళ్ళుమూసుకుని. ఎల్లకాలం చల్లగా బ్రతుకు." అని గీతోపదేశం చేసి మెల్లిగా జారు కొన్నాడు, అక్కణ్ణుంచి.

కొంతకాలం తర్వాత ఈ లోకం నుంచి.

**** ****

అయితే ఆయన ఆదేశాన్ని తూచా పాటించలేదు.

అప్పటికి డిగ్రీ చదువుకుంటున్న ఇప్పటి మా ఆవిడ బంగారులక్ష్మిని చేసుకొన్నాను. దూరపు బంధువుల ద్వారా తెలిసిన సంబంధం. చూడగానే ఆకర్షించే అందమైన రూపం .

పెళ్ళయిన తర్వాత శోభనం గదిలోకి అడుగు పెట్టాను.



బంగారులక్ష్మీ సీరియస్‌గా వాళ్ళ ఫ్రెండ్స్ తో ఫోన్లో మాట్లాడుతుంది.

' ఎంత ధైర్యమే వాడికి . చెయ్యి వేస్తాడా? చెంప పగలగొట్ట లేక పోయావా! కట్టుకొన్న మొగుడైనా సరే, మనకిష్టం లేనప్పుడు తాకరాదని తెలీదా!' అంటూ.

నా గొంతు తడారిపోయింది.

నీళ్ళు నములుతూ నిల్చున్నాను.

ఫోన్ సంభాషణ ముగిశాక నాతో అంది.

" అయ్యో, మీరొచ్చి ఎంత సేపైందండీ. గమనించలేదు. గదిలోకి మీరొచ్చాక నన్ను లోనికి తోస్తామన్నారు.'వీళ్లేదూ ఎవరు ముందొస్తే వాళ్ళు కూర్చొంటాంలే' అన్నాను. ఇంతలోగా ఫోనొస్తే మాటల్లో పడిపోయాను" అంటూ సిగ్గుపడిపోయింది.

" బంగారూ, ఐలవ్యూ" అంటూ దగ్గరకు తీసుకో బోయాను. కంగారు పడిపోయింది.

" ఏమండీ భార్యా భర్తలు ఎలా ఉండాలంటారు?"

"స్నేహితుల్లా "

" అయితే స్నేహం కొద్దీ ఒక మాట. మూడు నెలల్లో నాకు డిగ్రీ పరీక్షలున్నాయి. అవి పూర్తయ్యేవరకూ నన్ను డిస్టర్బ్ చెయ్యకూడదు. సరేనా? "

" సరే" నా గొంతు నాకే నీరసంగా అనిపించింది.

" థాంక్సండీ" అంటూ తలగడ క్రిందనున్న పుస్తకాలు చదువుకోవడానికి తీసింది.

ఆ మర్నాడు 'ఏమిటోయ్ శోభనపు పెళ్ళి కొడుకా రాత్రంతా నీ గది లైట్లు వెలుగుతూనే ఉన్నాయ్.' అంటూ ముసి ముసి నవ్వులు నవ్విన ఎదురింటి సుబ్రావ్ ని కొట్టినంత పని చేశాను.

ఆవిడ పరీక్షలు పూర్తయ్యేవరకూ టీ, కాఫీలు బోర్న్ విటాలు తయారు చెయ్యడం లో కొంతమేర సాయపడ్డాను.

ఆవిడ ఆపై గర్భవతి అయ్యాక వాటితో పాటు వంట చెయ్యడం నేర్చుకొన్నాను. మా ఆవిడ కడుపులో మా చిన్నారి పడినప్పుడు గోముగా అంది.

" ఏమండీ మీరు నాకు దేవుడిచ్చిన భర్త. అన్నిట్లో సాయపడ్డారు. విసుక్కోరు మనమో పని చేద్దామా?" గుండెలో రాయి పడింది. గోముగా బంగారు మాట్లాడిందంటే నా మెడకి ఇంకో బరువు ఏడ్ అయినట్టే.

" మనం ఇద్దరి పిల్లల్ని కందాం. మొదటి పిల్లకి బాధ్యతలన్నీ మీరే పడాలి. నేను సాయం మాత్రమే చేస్తాను. రెండో పిల్ల బాధ్యత నేను పడ్తాను. మీరు హెల్ప్ మాత్రం చేద్దురు గానీ యేం?"

" అలాగే లేవోయ్." అంటూ కాఫీ అందించాను.

' మై స్వీట్ హస్బెండ్ ' అంటూ మొట్టికాయ వేసి, కాఫీ జుర్రుకొంది.

తర్వాత ఏం చెప్పమంటారు. పిల్ల పెరిగి నాశ్రమ తగ్గిందన్న టైమ్ కి ఎమ్మే చదువుతానంది. ఎమ్మే పూర్తయ్యేసరికి నాకు ఇంటి పనీ వంట పనీ పూర్తిగా అబ్బేసింది.

అదుగో ఆ రెండో పిల్ల పుట్టక పోతుందా,తన బాధ్యత పెరగక పోతుందా అని నేను లెక్కలు వేసుకొనే లోగా కాల చక్రం గిర్రున తిరిగి మా పదో పెళ్ళి రోజు కూడా వచ్చేసింది. గత మంతా గుర్తుకు వచ్చి తీరిగ్గా నెమరేసు కొంటుండగా

' ఏమండీ ' అంటూ మా బంగారు గొంతు గోముగా వినిపించింది.

మళ్ళీ గుండెలో రాయి.

"పాప బై చెప్పి వెళ్ళి గంటయ్యింది. మీరింకా వరండాలోనే ఉండి పోయారు. ఏమిటా పరధ్యానం?"

" ఏం లేదోయ్ మన ప్రొడక్షన్ నెంబర్ టూ కోసం ఆలోచిస్తున్నాను."

"చాల్లెండి సరసం. పెళ్ళి రోజు అంటే చాలు, ఎక్కడ లేని చిలిపితనం మీకు.సరే కానీ నా కొకటి చెయ్యాలనుంది ఎప్పటినుంచో. చెప్పనా?".

" నాకు తెలుసు బాపు కార్టూన్లో భార్య కంది పచ్చడి చేస్తుంటే భర్త ప్రక్కనే కూర్చుంటాడు. 'వాళ్లకీమధ్యనే పెళ్ళయ్యింది లెండి' అంటూ పక్కింటాయన కామెంట్ చేస్తాడు. అలాంటిదే ఏదో అయ్యుంటుంది. పైగా ఈరోజు మన పెళ్ళి రోజాయె " మురిసి పోతూ అన్నాను.

"అది కాదండీ నాకు పి.హెచ్.డీ చెయ్యాలనుంది.ఒక్క రెండు సంవత్సరాలు......"

ఆ మాట పూర్తి కాకుండానే గుడ్లు తేలేశాను.

మాటలు కూడ దీసుకొని అడిగాను " ఏంటి సబ్జెక్ట్?"

" పురుషాధిక్యత . గృహ హింస"

**శుభం**

**– డా. డి.వి.జి.శంకర రావు , మాజీ ఎంపీ,**
**పార్వతీపురం. 94408 36931.**

# కాళ్ళు తిమ్మిర్లు వచ్చి నొప్పులు పెడుతున్నాయా..

మన బాడీలో కొలెస్ట్రాల్ రెండు రకాలుగా ఉంటుంది. ఒకటి మంచి కొలెస్ట్రాల్, రెండు చెడు కొలస్ట్రాల్. వీటి కారణంగా మనకి చాలా ఆరోగ్య సమస్యలొస్తాయి. హై కొలెస్ట్రాల్ కారణంగా, బీపి, షుగర్, గుండెపోటు, కరోనరీ ఆర్టరీ సమస్యలు వస్తాయి.

**హై కొలెస్ట్రాల్..** రక్తంలో కొలెస్ట్రాల్ పెరగడాన్నే హై కొలెస్ట్రాల్ అంటారు. దీనినే హైపర్లిపిడెమియా, హైపర్ కొలెస్టెరోలేమియా అని కూడా ఉంటారు. మన బాడీ పనిచేయడానికి సరైన మొత్తంలో లిపిడ్స్ అవసరం. మీకు చాలా లిపిడ్స్ ఉంటే మీ శరీరం వీటిని వాడదు. ధమనుల్లో లిపిడ్స్‌ని నిర్మిస్తాయి. ఇవన్నీ రక్తంలో ఇతర పదార్థాలతో కలిపి ఫలకంలా తయారవవుతాయి.

**లిపిడ్ ప్రొఫైల్ టెస్ట్..** హైకొలెస్ట్రాల్ ఆరోగ్యానికి అస్సలు మంచిది కాదు. దీనిని ముందుగా గుర్తించకపోతే



ప్రాణానికే ప్రమాదం. శరీరంలో చెడు కొలెస్ట్రాల్ పెరిగితే మీరు జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే మొదట్లో ఎలాంటి లక్షణాలు కనిపించవు. లిపిడ్ ప్రొఫైల్ టెస్ట్‌తో ఈ సమస్యని గుర్తించొచ్చు.

**గుండె సమస్యలు..** రక్తంలో చెడు కొలెస్ట్రాల్ పెరిగినప్పుడు ధమనుల్ల అడ్డంకులు ఏర్పడతాయి. దీంతో గుండెకి రక్తం సరిగా అందదు. ఈ కారణంగా గుండెపోటు వస్తుంది.

**నొప్పులు..** రక్తంలో చెడు కొలెస్ట్రాల్ పెరిగితే తొడలు, తుంటి, కాళ్ళ కండరాలలో నొప్పులు ఉంటాయి. ధమను ల్లో కొవ్వు పేరుకుపోతే గుండెకి రక్తం చేరదు. అదనంగా, రక్తప్రసరణ కూడా ఎఫెక్ట్ అవుతుంది. కాళ్ళలో రక్త ప్రసరణ తగ్గుతుంది. దీంతో బాడీలో ఆక్సిజన్ కొరత ఏర్పడి శరీర భాగాల్లో నొప్పిగా ఉంటుంది. దీనినే పెరిఫెరల్ ఆర్టరీ డిసీజ్ అంటారు.

**లక్షణాలు..** అరకాళ్ళలో తీవ్రమైన నొప్పి, కాళ్ళ తిమ్మిర్లు, పాదాలు చల్లగా మారడం, కాలి గోళ్ళు పసుపు , రంగులోకి మారడం, పాదాలు ఉబ్బడం, కాళ్ళలో బలహీనత, కాళ్ళ చర్మ రంగులో మార్పు




# ఆధునిక రవాణా మార్గాలకు చిహ్నాలు

# మన రైల్వేలు

**ప్రయాణీకులు ఒక ప్రదేశం నుండి మరొక ప్రదేశానికి సులభంగా వెళ్లేందుకు ప్రపంచవ్యాప్తంగా చాలా దూరం వరకు రైల్వే ట్రాక్‌లు ఉన్నాయి. దీని కోసం అమెరికా, చైనా, రష్యా, భారతదేశం బలమైన రైల్వే నెట్‌వర్క్‌ను కలిగి ఉన్నాయి. భారతీయ రైల్వేలు ప్రపంచంలో నాల్గవ అతిపెద్ద రైలు నెట్‌వర్క్. భారతీయ రైల్వేలు భారతదేశంలోని ప్రభుత్వ యాజమాన్యంలో నడిచే అతిపెద్ద రైల్వే వ్యవస్థ. భారత రైల్వే వ్యవస్థ ప్రపంచంలోని అతిపెద్ద రైల్వే నెట్‌వర్క్‌లలో ఒకటి. భారతదేశంలో రైలుమార్గాల పొడవు సుమారుగా 63,140 కి.మీ (39,233 మైళ్ళు) ఉంది. భారత రైల్వే ప్రతి రోజూ 14,444 రైళ్ళను నడుపుతుంది. భారతదేశంలో రైల్వేలు దాదాపు 1,15,000 కి.మీ కంటే ఎక్కువ ట్రాక్ కల్గి ఉంది. భారతీయ రైల్వేలో ప్రతిరోజూ లక్షల మంది ప్రయాణిస్తున్నారు. అంతే కాకుండా ఇతర దేశాల్లో కూడా ప్రజల సౌకర్యార్థం రైలు నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేశారు. భారతదేశంలోని రైల్వే సిస్టమ్ రైల్వే మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించబడుతుంది. ప్రపంచంలోనే అత్యధిక సంఖ్యలో ఉద్యోగులను కలిగి వున్న సంస్థలలో భారతీయ రైల్వేది (సుమారు పదనాలుగు లక్షలు) ద్వితీయ స్థానము. భారతీయ రైల్వే కంప్యూటరీకరణలో అన్నింటిలో ప్రథమ స్థానంలో ఉంది. భారతదేశం 65 వేల కిలోమీటర్లతో నాల్గవ అతిపెద్ద రైలు నెట్‌వర్క్‌ను కలిగి ఉంది.**



**(ఐ.ప్రసాదరావు 6305682733)**

భారతీయ ఆర్థిక, సాంస్కృతిక, సామాజిక అభివృద్ధిలో రైల్వేలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. దేశం ప్రజల అందరినీ, అన్ని ప్రాంతాలను ఒకటిగా చేస్తున్నది రైల్వే వ్యవస్థ అని మరువరాదు. 1853 ఏప్రిల్ 16వ తేదీన 14 క్యారేజీలతో సుల్తాన్, సాహెబ్, సింధూ అని పేరుగల 3 లోకోమోటివ్ ఇంజన్ లతో సుమారు 34 కి.మీ ప్రయాణించిన మొదటి రైలు భారతీయ రవాణా మార్గాల చరిత్రను తిరగరాసింది. అయితే దీనికి ముందే, 1832లో రైల్వే ప్లాన్ ప్రారంభించినా, సుమారు దశాబ్దం పాటు ముందుకు సాగలేదు. అయితే 1844లో లార్డ్ హార్డింగ్ రైల్వేలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సాహించడం జరిగింది. 1845లో ఇండియన్ రైల్వే అసోసియేషన్ ఏర్పడింది తదుపరి ది గ్రేట్ ఇండియా పెనిన్సులర్ రైల్వేలో భాగమైంది. మొదటి సారిగా "రూర్కెల" లో 1851 డిసెంబర్ 22న నిర్మాణ వస్తువులు తీసుకుని థామస్ పేరుగల మొదటి లోకోమోటివ్ ట్రాక్ పై పరుగులు తీసింది. దీంతో అప్పటి వరకు గుర్రపు బండితో వస్తు రవాణా మార్గాలకు స్వస్తి చెప్పడం జరిగింది.

1845లో ఈస్ట్ ఇండియా రైల్వే ఏర్పడి, భారతదేశంలో తూర్పు, ఉత్తర ప్రాంతాల్లో రైల్వే స్టేషన్లు, మార్గాలు, కొత్త రైల్లు ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఇక 1853లో రైల్వే ప్రయాణం జయప్రదం అయిన తరువాత నేటి వరకూ భారతీయ రైల్వేలు వెనక్కు చూడలేదు సరికదా కొత్త కొత్త రికార్డులు క్రియేట్ చేస్తూ ముందుకు సాగుతున్నది. ప్రస్తుతం ప్రపంచంలోనే 4వ అతిపెద్ద రైల్వే వ్యవస్థ కలిగిన దేశంగా భారత్ గుర్తింపు పొందింది. 1,04,647 కి.మీ రైల్వే ట్రాక్ కలిగి ఉంది. 60,451 కి.మీ ఎలక్ట్రిఫికేషన్ జరిగింది. సుమారు 12 లక్షల మంది ఉద్యోగులు ఉన్నారు. దేశంలోనే 2వ ఎక్కువ మంది ఉద్యోగులు కార్మికులు ఉన్న సంస్థగా పేరొందింది.

1857లో "రాబర్ట్ మిట్ లాండ్ బ్రెటన్" బ్రిటిష్ ఇంజనీర్ కి దేశంలో రైల్వే వ్యవస్థ అభివృద్ధికి బాధ్యతలు అప్పగించారు. అప్పటికే పోర్ట్ సిటిలుగా ఉన్న బొంబాయి, మద్రాసు, కలకత్తా రైలు లైన్ నిర్మాణం కలిగి ఉన్నాయి... ముఖ్యంగా బొంబాయి - థానే మధ్య రైల్వే ప్రయాణం జయప్రదం అయిన తరువాత, దేశవ్యాప్తంగా రైల్వే లైన్లు చురుకుగా ఏర్పాటు చేశారు.

**(మిగతా 8వ పేజీలో)**

( 7వ పేజీ తరువాయి)

దీంతో వాణిజ్య వ్యాపారాలు, వస్తు రవాణా, ప్రజల ప్రయాణాలతో దేశం ఒక్కసారిగా అన్ని రంగాల అభివృద్ధిలో చురుకుగా పాల్గొనటానికి రైల్వే వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తున్నాయి...
దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశంలో రైల్వే వ్యవస్థ ముఖ్యంగా కొత్తగా రైల్లు ప్రవేశపెట్టడం, కొత్త మార్గాలు వేయడం ద్వారా దేశ ఆర్థికాభివృద్ధికి పునాదులు పడ్డాయి.
ముఖ్యంగా 1950లో మొదటి లోకోమోటివ్ తయారీ యూనిట్ చిత్తరంజన్ లో ఏర్పాటు చేశారు. అదే 1950 సంవత్సరంలో " ది సెంట్రల్ అడ్వైజరీ కమిటీ" సూచనలు మేరకు భారత రైల్వే వ్యవస్థను 6 జోన్లుగా విభజించారు. సదరన్, సెంట్రల్, వెస్టన్, నార్తర్న్, ఈస్టన్, నార్త్ ఈస్టన్ గా విభజించారు. 1952లో అన్ని బోగీల్లో ఫ్యాన్స్, లైట్లు, స్లీపింగ్ సదుపాయాలు ఏర్పాటు చేశారు. 1954లో మొదటి సారిగా డీజిల్ లోకోమోటివ్ ఇంజన్ ప్రవేశపెట్టారు. 1955 సౌత్ ఈస్టన్ జోన్ ఏర్పాటు చేయబడినది. 1956లో "ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ" మద్రాసులో ఏర్పాటు చేసి మొదటి సారిగా రైల్వే కోచ్ లు తయారు చేసారు
. అదే సంవత్సరం హౌరా – ఢిల్లీ మధ ఏ.సి రైలు మొదటి సారిగా ప్రవేశపెట్టారు. 1958లో నార్త్ ఈస్టన్ ఫ్రంట్నెర్ రైల్వే జోన్ ఏర్పడింది. 1969లో 120 కి.మీ వేగంతో ప్రయాణించే ఎక్స్ ప్రెస్ ట్రైన్ మొదటి సారిగా న్యూఢిల్లీ – హౌరా మధ్య ప్రవేశపెట్టడం జరిగింది. 1974లో రైల్వేలో 20 రోజుల పాటు భారిగా సమ్మె జరుగుట గమనార్హం...
లిలిలి 1980లో 130 కి.మీ వేగంతో నడిచే ట్రైన్లు ప్రవేశపెట్టడం జరిగింది. 1985లో దాదాపు బొగ్గుతో నడిచే ట్రైన్లు రద్దు చేశారు. 1986లో ఢిల్లీలో టికెట్ల బుకింగ్ కంప్యూటరీకరణ మొదటి సారిగా చేసారు. తరువాత 1995లో దేశవ్యాప్తంగా రైల్వే టిక్కెట్లు కంప్యూటరీకరణ జరిగింది. 1998లో కొంకణ్ రైల్వే ప్రారంభించారు. ఇక 2000 సంవత్సరం నుంచి రైల్వే లైన్లు విద్యుదీకరణ, రైల్వే వ్యవస్థ ఆధునీకరణ, కంప్యూటరీకరణ, హై స్పీడ్ ట్రైన్స్, సిగ్నల్స్ వ్యవస్థలో అనేక మార్పులు చేస్తూ దేశమంతటా ముందుకు సాగుతున్నది.
అక్టోబర్ 24, 1984లో మొదటి " మెట్రో రైల్" కలకత్తాలో ప్రారంభించారు. 1998లో బొంబాయి రైల్వే స్టేషన్ లో " కూపన్ వాలిడేటింగ్ మెషిన్" ఏర్పాటు చేశారు. 1999లో మరలా అనేక జోన్స్ ఉద్భవించాయి. 2000లో రైల్వే వెబ్సైట్ ఆన్ లైన్ జరిగింది.ఐ.ఆర్.సి.టి.సి 1999లో కలుపబడి, 2002లో ఆన్ లైన్ టిక్కెట్లు కంప్యూటరీకరణ జరిగింది. 2002లో ఢిల్లీ లో మెట్రో రైలు ప్రారంభించారు.2014లో మొదటి మోనో రైలు సిస్టం బొంబాయి ప్రారంభించారు. 2015 లో సి.యన్.జి తీసేసారు. 160 కి.మీ స్పీడ్ తో ప్రయాణించే " గతిమాన్" ఎక్స్ ప్రెస్ ట్రైన్ న్యూఢిల్లీ – అగ్రా మధ్య ప్రారంభించారు. ప్రస్తుతం సుమారు 8000 రైల్వే స్టేషన్లు కలిగి ఉంది



దేశంలోనే అతిరద్దిగా ఉండే హౌరా స్టేషన్ , అతి పొడవైన రైల్వే ప్లాట్ ఫాం గోరఖ్ పూర్ పేరు పొందాయి..ఇక ప్రపంచ వారసత్వ ప్రదేశం గా యునెస్కో చే గుర్తించబడిన " కల్కి – సిమ్లా" రైల్వే మార్గం చూడాల్సిందే..2017లో మొదటి సారిగా రైల్వే బడ్జెట్ ను




కేంద్ర బడ్జెట్ తో కలిపి ప్రవేశపెట్టడం జరిగింది. మరియు 2017లో హైదరాబాద్ లో " మెట్రో రైలు" ప్రారంభించారు.
2019 నుంచి 2022 వరకూ కోవిడ్ ప్రభావంతో రైల్వే వ్యవస్థ ఒడుదుడుకులు చవిచూసింది. ముఖ్యంగా ప్యాసింజర్ రైళ్లు రద్దు చేశారు. ఇప్పటికీ పూర్తి స్థాయిలో ప్యాసింజర్ రైళ్లు పునరుద్ధరణ చేయకపోవడం వల్ల పేద మధ్యతరగతి ప్రజలు నష్టపోతున్నారు.. ప్రభుత్వం ఇకనైనా చర్యలు తీసుకోవాలి. ఇక సరికొత్త హంగులతో, వేగంగా ప్రయాణించే " వందేభారత్" రైల్లు 2019లో న్యూఢిల్లీ – వారణాసి మధ్య మొదటి సారిగా ప్రవేశపెట్టడం జరిగింది..మన ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వందేభారత్ రైల్లు నడుస్తున్నాయి..

2010లో సుమారు దేశవ్యాప్తంగా 400 రైల్వే స్టేషన్లు ఆధునీకరణ చేసారు. డబుల్ ట్రాక్, జి.పి.యస్, బయో– టాయిలెట్ సౌకర్యాలు, మొబైల్ ఛార్జింగ్ వంటి సదుపాయాలు ఏర్పాటు చేశారు.
వందేభారత్, తేజాస్, గతిమాన్, మహారాజా, హమసఫర్, దురొంతో, డబుల్ డెక్కర్, అంత్యోదయ వంటి పలు రకాల ఎక్స్ ప్రెస్ రైల్లు నిత్యం దేశవ్యాప్తంగా లక్షలాది ప్రయాణికులను తమ తమ గమ్యాలను చేరవేస్తూ భారతీయ జీవనాడులుగా మన మదిని దోస్తూన్నాయి...వేల కిలోమీటర్ల దూరాన్ని గంటల వ్యవధిలో చేరుస్తూ అబ్బుర పరుస్తున్నాయి.ఇక త్వరలో" బుల్లెట్ ట్రైన్" భారత్ లో నడయాడబోతుంది..
అయినప్పటికీ కొన్ని దుర్ఘటనలు జరుగుతున్నాయి.. సాంకేతిక పరిజ్ఞానం లోపంతో, మానవ తప్పిదాలు వలన అప్పుడుల అప్పుడు రైల్వే ప్రమాదాలు జరుగుతున్నాయి. కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవల ఒడిసాలో జరిగిన ప్రమాదం మన కళ్ళ ముందు కదలాడుతుంది..ప్రభుత్వాలు సరైన చర్యలు తీసుకోవాలి. సిబ్బందికి కొత్త ఆధునిక టెక్నాలజీ, శిక్షణ అందివ్వాలి. సిగ్నల్స్ వ్యవస్థను ఆధునీకరణ చేయాలి. ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలి.ప్రభుత్వ రంగంలో రైల్వే కొనసాగాలి.ముఖ్యంగా మనలాంటి దేశంలో ఎక్కువగా పేద మధ్యతరగతి ప్రజలను దృష్టిలో ఉంచుకుని ప్యాసింజర్ బోగీలు తగినన్ని ఏర్పాటు చేయాలి. ధనవంతులు, డబ్బు ఉన్నవారికి అనుకూలంగా రైల్వే వ్యవస్థ మార్చరాదు. ముఖ్యంగా రైల్లో, స్టేషన్లు లలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ప్రైవేటీకరణ పేరుతో పేద మధ్యతరగతి ప్రజలకు రైలు ప్రయాణాన్ని భారంగా చేయరాదు.. అంతే కాకుండా, సరుకు రవాణాలోనూ మన రైల్వేలు అద్భుతమైన సేవలు అందిస్తున్నాయి. ఈవిధంగా సుమారు 170 సంవత్సరాలుగా భారతీయుల ప్రయాణంలో కీలక పాత్ర పోషిస్తున్న రైల్వేలు మన జీవితంలో ఒక భాగంగా విరాజిల్లుతోంది..మన జీవనాడులు – రైల్వేలు అని అనుటలో అతిశయోక్తి కాదేమో....






క్రైమ్ డ్రామా సినిమాలు ఎప్పటికీ ఔట్‌డేటెడ్ కాదు. సరిగ్గా ప్లాన్ చేసుకుంటే ప్రతీ క్రైమ్ డ్రామా మూవీ మినిమమ్ గ్యారెంటీ హిట్‌గా నిలుస్తుంది. అయితే ఈరోజుల్లో ఇలాంటి జోనర్‌లో వచ్చే సినిమాలు.. ఎక్కువగా స్క్రీన్ ప్లే పైనే దృష్టిపెడుతున్నాయి. ఒక క్రైమ్ జరగడం, అది పోలీసులు ఛేదించాలని చూడడం.. ఇదంతా ప్రతీ క్రైమ్ డ్రామాలో కామన్. కానీ అందులో ఎక్కువ ట్విస్టులు చేయడం వల్ల ప్రేక్షకులు కూడా ఈ జోనర్‌లో వచ్చే సినిమాల నుండి కొత్తదనం కోరుకుంటున్నారు. అలాంటి వారికోసమే తాజాగా ఓటీటీలో 'సైలెన్స్ 2' విడుదలయ్యింది. 2021లో విడుదలయిన 'సైలెన్స్'కు ఇది సీక్వెల్‌గా తెరకెక్కింది.

**కథ..** కథ విషయానికొస్తే.. నైట్ ఓవెల్ అనే బార్‌లో షూటౌట్ జరగడంతో సినిమా ప్రారంభమవుతుంది. అది ఎవరు చేశారు? ఎందుకు చేశారు తెలుసుకోవడానికి ఏసీపీ అవినాష్ వర్మ (మనోజ్ బాజ్‌పేయి) తన టీమ్‌తో రంగంలోకి దిగుతాడు. తన టీమ్‌లో పనిచేసే ఇన్‌స్పెక్టర్ సంజనా భాటియా (ప్రాచీ దేశాయ్).. అవినాష్ వర్మకు కేసు విషయంలో సాయంగా ఉంటుంది. మెల్లగా ఆ షూటౌట్ గురించి విచారణ ముందుకు వెళ్లిందగా.. వారికి దాని వెనుక కారణాలు తెలుస్తూ ఉంటాయి. వాళ్లు డీల్ చేస్తున్న విషయం చిన్నది కాదని అర్థమవుతోంది. మెల్లగా ఆ షూటౌట్‌లో భాగమయిన వారిని పోలీసులు ఎలా పట్టుకుంటారు? మెయిల్ విలన్ వరకు వాళ్లు ఎలా చేరుకుంటారు? అనేది తెరపై చూడాల్సిన అసలు కథ.

**విశ్లేషణ..** ఎన్నో ఇతర క్రైమ్ డ్రామా సినిమాలలాగానే 'సైలెన్స్ 2' కూడా ట్విస్టుల మీద ట్విస్టులతోనే ముందుకెళ్తుంది. కానీ స్క్రీన్ ప్లే విషయంలో మాత్రం ఇతరులలాగా కాకుండా తనకంటూ ఒక సొంత స్టైల్‌ను క్రియేట్ చేసుకున్నారు దర్శకురాలు అబాన్ భారుచా డియోహాన్స్. అయితే ఒక క్రైమ్ థ్రిల్లర్‌లో వెంటవెంటనే అనవసరమైన ట్విస్టులను చేర్చాల్సిన అవసరం లేదని అబాన్ నిరూపించారు. అందుకే 'సైలెన్స్ 2'లో ఒక లీడ్ నుండి మరో లీడ్‌కు వెళ్లే సమయంలో కాస్త బోర్ కొట్టినట్టు అనిపిస్తుంది. కానీ బోర్ కొడుతుందేమో అని ప్రేక్షకుడు ఫీలయ్యే సమయానికి అక్కడ ఏదో ఒక ట్విస్ట్‌ను యాడ్ చేశారు. అలా అప్పుడప్పుడు కాస్త బోర్ కొట్టినట్టు అనిపించినా.. హాలీడేకు మంచి క్రైమ్ థ్రిల్లర్‌ను చూడాలంటే 'సైలెన్స్ 2'ను ట్రై చేయవచ్చు.

**చివరి వరకు సస్పెన్స్..** ఇక 'సైలెన్స్ 2'లో లీడ్ రోల్స్ చేసిన నటీనటుల విషయానికొస్తే.. మనోజ్ బాజ్‌పేయి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. పోలీస్ పాత్ర అయినా, లాయర్ పాత్ర అయినా.. ఆయన మెథడ్ యాక్టింగ్ ద్వారా ఆ పాత్రలో లీనమయిపోతాడు. ఇక 'సైలెన్స్'లో కేవలం ఒక హత్య కేసుపైనే అవినాష్ వర్మ టీమ్ అంతా కష్టపడుతుంది. కానీ 'సైలెన్స్ 2'లో అలా కాదు. ఒక బార్ షూటౌట్, అసలు అది ఎందుకు జరిగింది, ఎవరు చేయించారు అనే కథ.. సినిమా మొత్తాన్ని చాలావరకు ఇంట్రెస్టింగ్‌గా నడిపించింది. ఇందులో హంతకుడు ఎవరు అని చివరి వరకు సస్పెన్స్ మెయింటెయిన్ చేయడంలో డైరెక్టర్ అబాన్ భారూచా సక్సెస్ అయ్యారు. కొన్ని సీన్స్ సీట్ ఎడ్జ్‌లో కూర్చోబెడతాయి.

**పోలీస్ క్యారెక్టర్స్‌లో పట్టు లేదు..** ఇతర క్రైమ్ థ్రిల్లర్స్‌లో చూసిన పోలీస్ టీమ్స్‌లాగా 'సైలెన్స్ 2'లోని అవినాష్ వర్మ టీమ్ ఉండదు. అంటే ఇందులో అవినాష్ వర్మగా నటించిన మనోజ్ బాజ్‌పేయి పర్సనల్ లైఫ్ గురించి తప్పా.. ఇతర పోలీస్ ఆఫీసర్లకు ప్రత్యేకంగా ప్రాధాన్యత ఏమీ ఇవ్వలేదు. ఇన్వెస్టిగేషన్ విషయానికి వచ్చేసరికి అందరూ సమానంగా అన్నట్టుగానే చూపించినా.. ఎక్కువశాతం స్టోరీలో మనోజ్ బాజ్‌పేయి, ప్రాచీ దేశాయ్ పాత్రలే కీలకం. ప్రాచీ కూడా తన పాత్రకు న్యాయం చేసింది. మిగిలిన ఇద్దరు ఆఫీసర్ల పాత్రలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. అక్కడక్కడా బోర్ కొట్టిన పర్వాలేదు.. ఒక మంచి క్రైమ్ థ్రిల్లర్ చూడాలి అనుకునే ప్రేక్షకులు.. జీ5లో అందుబాటులో ఉన్న 'సైలెన్స్ 2'ను ట్రై చేయవచ్చు.

---




బాలీవుడ్ అనేది హిట్ల కోసం ఎక్కువగా కమర్షియల్ సినిమాలకంటే బయోపిక్స్, రీమేక్స్‌పైనే ఆధారపడుతుంది అన్నది అందరికీ తెలిసిన ఓపెన్ సీక్రెట్. ఈతరంలో ఎక్కువగా ఎవరికీ తెలియకుండా మిగిలి పోయిన ఎంతోమంది బయోపిక్స్‌ను తెరకెక్కించి.. వారి గురించి ప్రేక్షకు లకు తెలిసేలా చేశారు బాలీవుడ్ మేకర్స్. ఇక ఆ లిస్ట్‌లోకి యాడ్ అయ్యింది తాజాగా విడుదలయిన 'చమ్కీల'. దర్శకుడు ఇంతియాజ్ అలీ మామూలు కథనే గుండెకు హత్తుకునేలా తెరకెక్కించగలడు. అలాంటిది ఇలాంటి ఒక కాంట్రవర్షియల్ బయోపిక్‌తో అసలు చమ్కీల అంటే ఎవరో అందరికీ తెలిసేలా చేశాడు.

**కథ..** 1960లో ధని రామ్‌గా ఒక సిక్ దళిత కుటుంబంలో పుట్టిన వ్యక్తి.. 1980ల్లోకి వచ్చేసరికి అమర్ సింగ్ చమ్కీలా ఎలా మారాడు అనేది 'చమ్కీల' కథ. 1980ల్లోనే ఒక సింగర్‌గా చమ్కీలకు ఆ రేంజ్‌లో పాపులారిటీ రావడానికి కారణం.. తన డబుల్ మీనింగ్ పాటలే. ప్రేమపై మాత్రమే కాదు, లస్ట్‌పై కూడా పాటలు రాసి, వాటిని పాడుతూ అప్పట్లో సంచలనం సృష్టించాడు చమ్కీల. ప్రతీ ఊరిలో ఈవెంట్స్ ఏర్పాటు చేస్తూ.. ఇలాంటి పాటలు పాడుకుంటూ ఒక రేంజ్‌లో ఫేమస్ అయ్యారు. ఈ ప్రయాణంలో తన భార్య అమర్జోత్ కూడా ఆయనకు తోడు అయ్యారు. చమ్కీల డబుల్ మీనింగ్ పాటలు పాడుతున్నప్పుడు అమర్జోత్ కూడా ఆయనతో గొంతు కలిపారు. ఇక అమర్ సింగ్ చమ్కీలకు 28 ఏళ్లు ఉన్నప్పుడే.. అంటే 1988 మార్చి 8న మెహ్సాంపూర్‌లో ఆయనను హత్య చేశారు. అసలు ఆయన హత్యకు దారితీసిన పరిణామాలు ఏంటి అనేది 'చమ్కీల' సినిమా కథ. ఈ మరణం వెనుక అప్పట్లో ఎన్నో వార్తలు వచ్చాయి. అసలు ఎందుకలా జరిగింది అని ఈ సినిమా ద్వారా చెప్పే ప్రయత్నం చేశాడు ఇంతియాజ్ అలీ.

**విశ్లేషణ..** మామూలుగా ఒక బయోపిక్‌కు ప్రేక్షకులకు నచ్చేలా తెరకెక్కించడం చాలా కష్టం. కానీ బాలీవుడ్ ఇన్నేళ్లుగా ఈ విషయంలో సక్సెస్ అవుతూనే వచ్చింది. 'చమ్కీల'తో మరోసారి అదే ప్రూవ్ అయ్యింది. ఒక కమర్షియల్ సినిమాలా కాకుండా కాస్త డాక్యుమెంటరీ అనే ఫీల్ వచ్చేలాగా 'చమ్కీల'ను తెరకెక్కించాడు దర్శకుడు ఇంతియాజ్ అలీ. అక్కడక్కడా అమర్ సింగ్ చమ్కీల జీవితంలో జరిగిన నిజమైన ఫుటేజ్‌ను చూపించడం వల్ల ఇదొక డాక్యుమెంటరీ అనే ఫీల్ వస్తుంది. మామూలుగా సింగర్ బయోపిక్ అంటే ఎలా ఉండాలో.. 'చమ్కీల' అచ్చం అలాగే ఉంటుంది. ఎక్కువగా పాటలతో మూవీ అంతా నిండిపోయినట్టుగా అనిపిస్తుంది. కానీ మ్యూజిక్ అంటే ఎక్కువగా ఇష్టపడి, ఎంజాయ్ చేసేవారికి ఇది పెద్ద సమస్యగా అనిపించకపోవచ్చు. అమర్ సింగ్ చమ్కీల జీవిత కథతో కబీర్ సింగ్ చౌదరి ఇదివరకే 'మెహ్సాంపూర్' అనే డాక్యుమెంటరీని తెరకెక్కించారు. ఇప్పుడు ఇంతియాజ్ అలీ.. తన స్టైల్‌లో చమ్కీల కథను ప్రేక్షకులకు ప్రజెంట్ చేసే ప్రయత్నం చేశారు. ఒక సింగర్‌కు మాత్రమే కాదు.. ప్రతీ ఆర్టిస్ట్‌కు తన ఆర్ట్ పట్ల ఎంత ప్రేమ ఉంటుందో అనే విషయాన్ని గుండెకు హత్తుకునే చెప్పే ప్రయత్నం చేశాడు దర్శకుడు.

**ఆ ముగ్గురి కోసం..** చమ్కీల'లో ముఖ్యంగా చెప్పుకోవాల్సింది హీరోహీరోయిన్లుగా నటించిన దిల్జీత్ దోసంజ్, పరిణీతి చోప్రా గురించి. దిల్జీత్ దోసంత్ ఒరిజినల్‌గానే పంజాబీ సింగర్ కాబట్టి ఈ పాత్ర కోసం తను పెద్దగా కష్టపడలేదు అనిపించింది. కానీ పరిణీతి చోప్రా విషయానికొస్తే.. తన కెరీర్ మొత్తంలో ఇలాంటి ఒక పాత్ర తను మళ్లీ చేయలేదేమో అన్న రేంజ్‌లో ఉంది. హీరోకు సమానంగా ప్రాధాన్యత ఉన్న పాత్ర రావడం ఒక ఎత్తు అయితే.. దానిని అంతే డెడికేషన్‌తో చేయడం మరో ఎత్తు. చమ్కీలగా దిల్జీత్ ఎంత కష్టపడ్డాడో.. అమర్జోత్‌గా పరిణీతి కూడా అంతే కృషి చేసిందని అర్థమవుతోంది. ఇక 'చమ్కీల'కు ప్రాణంగా నిలిచిన మరో వ్యక్తి ఏఆర్ రెహమాన్. ఒక సింగర్ బయోపిక్ అంటే మ్యూజిక్ ఎలా ఉండాలి, పాటలు ఎలా ఉండాలి అనే విషయాన్ని రెహమాన్‌ను చూసి నేర్చుకోవాలి అనిపిస్తుంది. ప్రస్తుతం 'చమ్కీల'.. హిందీతోపాటు తెలుగులో కూడా అందుబాటులో ఉంది. కానీ పంజాబీ పాటలను ఇతర భాషల్లో మార్చడానికి ప్రయత్నిస్తే వాటి ఫ్లేవర్ పోతుందని భావించిన మేకర్స్.. పాటలను మాత్రం డబ్ చేయలేదు. అందుకే ఇతర భాషల్లో చూసేవారు పాటలకు అంత కనెక్ట్ కాకపోవచ్చు.

---

## 60 ఏళ్ల అందానికి మిస్ యూనివర్స్ కిరీటం దాసోహం

### చరిత్రలో ఇదే తొలిసారి

అందాల పోటీలో పాల్గొనడానికీ పనికొస్తానా..అని అనుకోలేదు. ఈ వయసులో ఈ పనేంటని వెనక్కి తగ్గలేదు. పోటీ చేసింది. కిరీటాన్ని సాధించింది. అర్జెంటీనాకి చెందిన అలెజండ్రా మరిసా రోడ్రిగ్జెజ్ ఈ అసాధ్యాన్ని సుసాధ్యం చేసింది. 60 ఏళ్ల వయసులో మిస్ యూనివర్స్ పోటీలో పాల్గొనడమే కాకుండా ఆ టైటిల్‌ని గెలుచుకుంది. అర్జెంటీనాలోని బ్యూనెస్ ఎయిర్స్ లో జరిగిన ఈ అందాల పోటీల్లో ఆమె విజయం సాధించి అందరినీ ఆశ్చర్యపరిచింది. వయసు 60 ఏళ్లే అయినా చూడడానికి మాత్రం చాలా యంగ్‌గా ఉన్నారామె. ఇప్పటి వరకూ జరిగిన మిస్ యూనివర్స్ పోటీల్లో ఇదే ఎంతో అరుదైందిగా చరిత్ర సృష్టించింది. ఆమెకి వ్యక్తిగతంగానూ పేరు తెచ్చి పెట్టింది. ఇప్పుడు సోషల్ మీడియా అంతా అలెజండ్రా పేరు మారు మోగుతోంది. "ఈ వయసులోనూ ఎంత అందంగా ఉన్నారో" అని అందరూ తెగ పొగిడేస్తున్నారు. లా పల్టా నగరానికి చెందిన అలెజండ్రా ఓ జర్నలిస్ట్, న్యాయవాదిగా పని చేస్తున్నారు. ఇదే సమయంలో అందాల పోటీపైనా దృష్టి పెట్టారు. ఇన్నాళ్లు ఉన్న స్టీరియోటైప్ ఆలోచనలను చెరిపేస్తూ ధైర్యంగా ముందుకొచ్చి పోటీ చేశారు. ఈ వయసులో ఈ కిరీటాన్ని దక్కించుకున్న తొలి మహిళగా రికార్డు సృష్టించారు. ఆమె ర్యాంప్‌పై నడుస్తుంటే ప్రేక్షకులతో పాటు జడ్జిలూ ఆశ్చర్యపోయారు. ఈ అందాల పోటీలో పాల్గొనే ముందు ఆమె ఎలాంటి కసరత్తు చేశారో ఓ వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ప్రస్తుతం ఇది తెగ వైరల్ అయింది. ఈ ఏడాది సెప్టెంబర్‌లో మెక్సికోలో మిస్ యూనివర్స్ వరల్డ్ పోటీలు జరగనున్నాయి. అందులోనూ పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు అలెజండ్రా మరిసా. మహిళలంటే కేవలం శారీరక అందం మాత్రమే కాదని,అంతకు మించి అని నిరూపించడానికే ఈ పోటీల్లో పాల్గొన్నట్టు ఆమె చెబుతున్నారు. ఈ పోటీలో పాల్గొనడం చాలా గర్వంగా ఉందని అంటున్నారు. అయితే... అలెజండ్రా ఈ పోటీల్లో పాల్గొనడానికి మరో కారణం కూడా ఉంది. గతేడాది మిస్ యూనివర్స్ సంస్థ కీలక ప్రకటన చేసింది. ఇకపై ఈ పోటీల్లో పాల్గొనే వారికి ఎలాంటి వయసు పరిమితి విధించడం లేదని వెల్లడించింది. 18 ఏళ్లపై బడిన వాళ్లు ఎవరైనా సరే కంటెస్ట్ చేయొచ్చని తెలిపింది. ఈ ప్రకటన చేసిన తరవాతే అలెజండ్రా పోటీల్లో పాల్గొనాలని నిర్ణయించుకున్నారు. ఇప్పటి వరకూ ఈ కిరీటం దక్కించుకున్న వాళ్లలో 18-28 ఏళ్ల వయసున్న వాళ్లే ఉన్నారు. ఈ రికార్డుని చెరిపేశారు అర్జెంటీనాకి చెందిన అలెజండ్రా మరిసీ.



# సినిమా రివ్యూ



విశాల్ కథానాయకుడిగా నటించిన తాజా సినిమా 'రత్నం'. దీనికి హరి దర్శకత్వం వహించారు. 'భరణి', 'పూజ' చిత్రాల తర్వాత వీళ్లిద్దరి కలయికలో తెరకెక్కిన మూడో చిత్రమిది. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందించారు. తెలుగు, తమిళ భాషల్లో ఈ రోజు విడుదల అయ్యింది. యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన ఈ సినిమా ఎలా ఉంది? అనేది రివ్యూలో చూడండి.

**కథ :** చిత్తూరులో రత్నం (విశాల్)కి ఎదురులేదు. ఎవరికైనా అన్యాయం జరిగితే ఒక్క నిమిషం ఆలస్యం చేయడు. రంగంలోకి దిగుతాడు. హత్య చేయడానికి వెనుకాడడు. ఎమ్మెల్యే పన్నీర్ స్వామి (సముద్రఖని) అండ ఉండటంతో పోలీసులు రత్నాన్ని ఏమీ చేయరు. ఓ రోజు మల్లిక (ప్రియా భవానీ శంకర్)ను చూస్తాడు రత్నం. ఆమెను ఎక్కడో చూసినట్టు ఉందని చెబుతాడు. ఆమెపై హత్యాయత్నం జరిగితే ప్రాణాలకు తెగించి కాపాడతాడు. ఆ తర్వాత ఆమెకు తమిళనాడులోని లింగం (మురళీ శర్మ) బ్రదర్స్ నుంచి ముప్పు ఉందని తెలుసుకుంటాడు. లింగం బ్రదర్స్ ఎవరు? వాళ్లకు, మల్లికకు గొడవ ఏమిటి? రత్నం తల్లి రంగనాయకి ఎవరు? ఆమె ఎలా మరణించింది? లింగం బ్రదర్స్ మీద రత్నం పగకు, వాళ్లను చంపడానికి రంగనాయకి ఎలా కారణం అయ్యింది? చివరకు ఏమైంది? అనేది సినిమా.

**విశ్లేషణ ...** తమిళనాట రూరల్ బ్యాక్ డ్రాప్ కమర్షియల్ సినిమాలకు కేరాఫ్ అడ్రస్ హరి. కథతో సంబంధం లేకుండా పరుగులు పెట్టించే కథనంతో సినిమాలు తీయడం ఆయన స్టైల్. యాక్షన్ ఎపిసోడ్స్, ముఖ్యంగా ఛేజింగ్ సీక్వెన్సులు తీయడంలో హరికి సపరేట్ స్టైల్ ఉంది. తెలుగు ప్రేక్షకులు సింగమ్ సిరీస్ ఆదరించడానికి కారణం కూడా ఆ స్పీడ్. అయితే... కొన్నాళ్లుగా హరి తీసిన సినిమాలు ఆశించిన స్థాయిలో ఉండటం లేదు. మరి, రత్నం ఎలా ఉంది? అనే విషయానికి వస్తే...

దర్శకుడు హరి మార్క్ టేకింగ్, యాక్షన్ ఎపిసోడ్స్ ఉన్న మాస్ యాక్షన్ సినిమా 'రత్నం'. అయితే, అసలు సమస్య అంతా కథతోనే! సినిమా ప్రారంభం రొటీన్‌గా ఉంటుంది. ఎమ్మెల్యేను మావయ్య అని పిలిచే హీరో, అతడు ఏం చేసినా చేతులు కట్టుకుని చూసే పోలీసులు, హీరోయిన్ ఎంట్రీ, ఆమె కోసం ఫైట్... కొంచెం కూడా కొత్తదనం లేని కథ, కథనాలతో సినిమా ముందుకు వెళుతూ ఉంటుంది. మధ్య మధ్యలో దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ కొంత ఉపశమనం కలిగిస్తుంది. డిఎస్పీ ట్యూన్స్ బావున్నాయి. తెలుగు సాహిత్యం కాస్త బావుంటే పాటలు ప్రేక్షకుల్లోకి వెళ్లేవి.

హరి మీద ప్రేమతో ఆయన మార్క్ యాక్షన్ ఎపిసోడ్స్ ఎంజాయ్ చేసే ప్రేక్షకులకు కూడా హీరోయిన్ ట్విస్ట్ షాక్ ఇస్తుంది. మల్లిక (ప్రియా భవానీ శంకర్)లో తన తల్లిని చూసుకున్నానని, ఆమె రూపు రేఖలతో ఉండటం వల్ల సాయం చేశానని రత్నం చెబుతాడు. హీరోయిన్ ప్రేమను హీరో సున్నితంగా తిరస్కరిస్తాడు. అక్కడి నుంచి ఊహలకు అందని విధంగా హరి సినిమాను తీశారు. పోనీ, హీరో తల్లికి హీరోయిన్ మేనకోడలు అవుతుందని అనుకుంటే ఆ అవకాశం కూడా ఇవ్వలేదు. బహుశా... ఈ ట్విస్ట్ ప్రేక్షకులకు కొత్తగా అనిపిస్తుందని, థియేటర్లలో వాళ్లకు షాకింగ్ సర్‌ప్రైజ్ అవుతుందని భావించారు ఏమో! బ్యాక్ ఫైర్ అయ్యింది. హీరో హీరోయిన్ రిలేషన్షిప్, ఆ సీన్స్ కన్వీనింగ్‌గా తీయలేదు. దాంతో సెకాండాఫ్ భరించడం కష్టంగా మారింది. దానికి తోడు హరి మేకింగ్ అప్పటికే బోర్ కొట్టిస్తుంది. క్లైమాక్స్ కోసం ఎదురు చూసేలా సినిమా తీశారు. ఎండ్ అయిపోయిందనుకున్న ప్రతిసారి కథలో కొత్త రిలేషన్ ఓపెన్ చేసి సాగదీశారు.

**టెక్నికల్ టీం...** కెమెరా వర్క్, ఎడిటింగ్, యాక్షన్ ఎపిసోడ్స్... అన్నిటిలో హరి రెగ్యులర్ సినిమాల స్టైల్ కనిపించింది. డీఎస్పీ సంగీతంలో 'ప్రాణం...', 'చెబుతావా...' ట్యూన్స్ బావున్నాయి. నేపథ్య సంగీతంలో హరి స్టైల్ తప్ప డీఎస్పీ మార్క్ కనిపించలేదు. రత్నం పాత్రలో విశాల్ కొత్తగా చేసింది ఏమీ లేదు. ఇంతకు ముందు సినిమాల్లో ఎలా ఉన్నారో... ఈ సినిమాలోనూ సేమ్ స్టైల్, యాక్టింగ్. ఆయన కొత్తగా చేసింది లేదు. ఆయనతో హరి కూడా కొత్తగా చేయించలేదు. ప్రియా భవానీ శంకర్ కొన్ని సన్నివేశాల్లో బాగా చేశారు. ఎమోషన్స్ చక్కగా చూపించారు. సముద్రఖని, మురళీ శర్మ నుంచి హరీష్ పేరడీ, జయప్రకాశ్ వరకు టాలెంటెడ్ ఆర్టిస్టులు ఉన్నా సరే వాళ్లతో లౌడ్ యాక్టింగ్ చేయించారు హరి. యోగిబాబు, మొట్ట రాజేంద్రన్ కామెడీకి కితకితలు పెట్టుకున్నా నవ్వు రాదు.

**చివరిగా ..** 'రత్నం' సినిమాలో సూపర్ హిట్ అయ్యే ఛాన్సులు ఉన్నాయి. పది పదిహేనేళ్ల క్రితం వస్తే గ్యారంటీ హిట్. ఇప్పుడు అయితే... ఈ జనరేషన్ ప్రేక్షకులు సినిమాను ఆదరించడం కష్టమే. 'రత్నం'లో ప్రధాన సమస్య... కాలంతో పాటు వస్తున్న మార్పులకు అనుగుణంగా హరి అప్డేట్ కాకపోవడమే. ఆయన స్టైల్ యాక్షన్ ఎపిసోడ్స్ ఎంజాయ్ చేసే ఆడియన్స్ వాటి కోసం వెళితే వెళ్లవచ్చు. సగటు ప్రేక్షకులు సినిమా ఎంజాయ్ చేయడం చాలా అంటే చాలా కష్టం.

---

: పుస్తకాల ఆధారంగా సినిమాలు, వెబ్ సిరీస్‌లు తెరకెక్కడం కామన్. కానీ ఈ అమెరికన్ వెబ్ సిరీస్ మాత్రం ఏకంగా ఒక గేమ్ నుంచి ఇన్‌స్పైర్ అయ్యి తెరకెక్కింది. అదే 'ఫాల్ ఔట్'. ఇప్పటికే ఈ టైటిల్‌తో ఒక గేమ్ సిరీస్ ఉంది. అంతే కాకుండా కొన్నాళ్ల క్రితం ఇదే టైటిల్‌తో జాకీ చాన్.. ఒక మూవీని కూడా తీశారు. కానీ ఈ 'ఫాల్ ఔట్' మాత్రం డిఫరెంట్. భవిష్యత్తును అంచనా వేస్తూ అమెరికన్ మేకర్స్ తెరకెక్కించే సినిమాలు, వెబ్ సిరీస్‌లు చాలావరకు ప్రేక్షకులను ఆకట్టుకునేలా ఉంటాయి. 'ఫాల్ ఔట్' కూడా ఆ తరహాదే. తాజాగా నెట్‌ఫిక్స్ లో విడుదలయిన 'ఫాల్ ఔట్' ఫస్ట్ సీజన్‌కు మంచి రెస్పాన్స్ వస్తోంది.



**కథ** 'ఫాల్ ఔట్' కథ 2077లో ప్రారంభమవుతుంది. సిరీస్ మొదలవ్వగానే ఒక న్యూక్లియర్ పేలుడు సంభవిస్తుంది. ఈ పేలుడు వల్ల చాలామంది మరణిస్తారు. మిగిలిన వారంతా భూమి అండర్ గ్రౌండ్‌లో ఉండే వాల్ట్స్‌లోకి వెళ్లిపోతారు. అక్కడ రకరకాల వాల్ట్స్, వాటికి నెంబర్లు కూడా ఉంటాయి. ఇదంతా వాల్ట్ టెక్ కార్పొరేషన్ నిర్మిస్తుంది. భూమిపై న్యూక్లియర్ యుద్ధాల నుంచి ప్రాణాలు కాపాడుకున్న చాలా మంది పైకి రాకుండా ఈ అండర్ గ్రౌండ్ వాల్ట్స్‌లోనే జీవనం కొనసాగిస్తుంటారు. అయితే, యుద్ధంలో తమ ప్రాణాలను కాపాడుకొనేందుకు ధనవంతుల కోసం భూమి అడుగున వాటిని నిర్మించారు. భూమిపై నిర్మించేవారికి ఇది ఇష్టం ఉండదు. దీంతో కొంతమంది చొరబాటుదారులు.. వాల్ట్‌లోకి ప్రవేశిస్తారు. వాల్ట్ 32లో ఉన్నవారిని హతమార్చుతారు. ఆ తర్వాత వాల్ట్ 33లో ఉన్నవారిని చంపి.. దాన్ని కూడా కైవసం చేసుకొనేందుకు ప్లాన్ చేస్తారు. ఈ సందర్భంగా వాల్ట్ 32 సభ్యులుగా నాటకమాడుతారు. ఈ సందర్భంగా వాల్ట్ 33లో ఉన్న లూసీ మ్యాక్లిన్ (ఎల్లా పూర్నెల్)ను పెళ్లి చేసుకుని.. రెండు వర్గాలు కలిసి బతుకుదామనే సందేశాన్నిఇస్తారు. ఇందుకు వాల్ట్ 33లోని సభ్యులు అంగీకరిస్తారు. వాల్ట్ 32లో ఉన్న వ్యక్తితో లూసీకి పెళ్లి చేస్తారు. ఫస్ట్ నైట్ పూర్తయిన తర్వాత.. అసలు విషయం బయటపడుతుంది. అయితే, అప్పటికే నష్టం జరిగిపోతుంది. వాల్ట్ 32 సభ్యుల ముసుగులో ఉన్న చొరబాటుదారులు. వాల్ట్ 33 సభ్యులపై దాడి చేస్తారు. లూసీ, ఆమె తండ్రి వాళ్లపై తిరగబడతారు. ఇద్దరు కలిసి వరుడిని చంపేస్తారు. ఆ తర్వాత చొరబాటుదారులు లూసీ తండ్రిని ఎత్తుకెళ్లిపోతారు. భూమిపై ఉన్న వారి స్థావరంలో బంధిస్తారు. తండ్రిని ఎలాగైనా తిరిగి వాల్ట్‌లోకి తీసుకొస్తానంటూ లూసీ బయల్దేరుతుంది అప్పటికే ఎన్నో న్యూక్లియర్ వార్స్ వల్ల భూమిపై రేడియేషన్ పెరిగిపోవడంతో మరెన్నో సమస్యలు మొదలవుతాయి. అలాంటి కష్టమైన పరిస్థితుల మధ్య లూసీ.. తన తండ్రిని వెతకడం మొదలుపెడుతుంది.

లూసీ.. తన తండ్రిని వెతికే ప్రయాణంలో మ్యాక్సిమస్ (ఆరోన్ క్లిఫ్టన్ మోటెన్), కూపర్ హోవర్డ్ (వాల్టన్ గాగిన్స్) ఎదురవుతారు. ఈ సందర్భంగా ఎన్నో సవాళ్లను ఎదుర్కోవల్సి వస్తుంది. వాల్ట్‌లో ఎంతో శాంతియుతంగా జీవించిన లూసీ.. భూమిపై ఉన్న పరిస్థితులను చూసి ఆశ్చర్యపోతుంది. అదే సమయంలో తన తండ్రిని కలుసుకొనేందుకు ఒక సాహసోపేతమైన అవకాశం వస్తుంది. మరి, మంచితనానికి మారుపేరైనా లూసీ అక్కడి పరిస్థితులను ఎలా ఎదుర్కొంటుంది. తన తండ్రిని ఎలా కలుస్తుంది? ఆమె తండ్రి గురించి ఎలాంటి నిజం తెలుస్తుంది. బాల్యంలోనే కనిపించకుండా పోయిన తల్లి ఆచూకీ ఎలా దొరుకుతుంది? ఇలా ఒకటేమిటీ.. మీకు ఓపిక ఉండాలేగానీ.. ప్రతి ఎపిసోడ్ ఉత్కంఠభరితంగా నెక్స్ట్ ఏమిటీ అనే తరహాలో ఉంటుంది. మనుషులు తమ స్వార్థం కోసం ఎంత దారుణానికి పాల్పడతారనేది చివరికి అర్థమవుతుంది. కొన్ని సీన్లు భావోద్వేగానికి గురిచేస్తాయి.

**విశ్లేషణ** 'ఫాల్ ఔట్' లాంటి ఫ్యూచర్ కథలతో ఇంగ్లీష్‌లో ఇదివరకే పలు వెబ్ సిరీస్‌లు వచ్చాయి. కానీ ఇది మాత్రం వాటికి భిన్నంగా ఉంటుంది. ఎందుకంటే ఇందులో పెద్దగా యాక్షన్ ఉండదు. అవును.. ఇంగ్లీష్ వెబ్ సిరీస్ అంటేనే ఎక్కువగా ఫైట్స్ ఆశిస్తారు ప్రేక్షకులు. కానీ 'ఫాల్ ఔట్' మాత్రం అలా కాదు. ఇందులో యాక్షన్ కంటే ఎక్కువగా డ్రామానే ఉంటుంది. న్యూక్లియర్ వార్ ఆగకపోతే భూమి పరిస్థితి ఏంటి? లూసీ తన తండ్రిని చేరుకునే మార్గం ఏంటి? అనే అంశాల చుట్టూ మంచి డ్రామాను క్రియేట్ చేశారు దర్శకులు. ఇందులో మొత్తం 8 ఎపిసోడ్లు ఉండగా.. కేవలం మొదటి ఎపిసోడ్, ఆఖరి ఎపిసోడ్‌లో మాత్రమే కాస్త యాక్షన్ ఉంటుంది. మిగతా సిరీస్ అంతా ఎక్కువగా ఎమోషన్స్‌పైనే నడుస్తుంది.

మామూలుగా ఒక ఇంగ్లీష్ వెబ్ సిరీస్‌లో డ్రామాను ప్రేక్షకులు ఎక్కువగా ఆశించరు కాబట్టి యాక్షన్ చూడాలనుకునే వారిని మాత్రం 'ఫాల్ ఔట్' కాస్త డిసప్పాయింట్ చేస్తుందనే చెప్పాలి. కానీ ట్విస్టుల విషయంలో మాత్రం ప్రేక్షకులు డిసప్పాయింట్ అవ్వరు. దిమ్మతిరిగే ట్విస్టులు ఉన్నాయని చెప్పలేం కానీ.. కథను ఇంట్రెస్టింగ్‌గా ముందుకు సాగించడం కోసం, తరువాతి ఎపిసోడ్‌పై ఇంట్రెస్ట్ క్రియేట్ చేయడం కోసం కావాల్సిన ట్విస్టులను అయితే యాడ్ చేశారు మేకర్స్. 'ఫాల్ ఔట్'లో మరో హైలెట్ ఏంటంటే ఈ సిరీస్‌లో ఉన్నది ' ఎపిసోడ్లే అయినా.. దీనికోసం అయిదుగురు దర్శకులు పనిచేశారు. మెచ్చుకోతగిన విషయం ఏమిటంటే.. ఈ సీరిస్ ఒక విజువల్ వండర్. మీకు ఒక కొత్త ప్రపంచాన్ని పరిచయం చేస్తాయి. లాజిక్స్ వెతుక్కోకుండా చూడాలి.

వెబ్ సిరీస్‌లలో ఒక్కొక్క ఎపిసోడ్‌కు ఒక్కొక్క దర్శకుడు మారుతూ ఉన్నప్పుడు.. ముందు ఎపిసోడ్ తీసిన డైరెక్టర్ విజన్‌ను మ్యాచ్ చేయాల్సి ఉంటుంది. ఆ విషయంలో మాత్రం 'ఫాల్ ఔట్' దర్శకులు వందశాతం సక్సెస్ అయ్యారు. 'ఫాల్ ఔట్'లోని మొదటి మూడు ఎపిసోడ్లు.. క్రిస్టోఫర్ నోలన్ బ్రదర్ అయిన జోనథన్ నోలన్ డైరెక్ట్ చేశాడు. 4వ ఎపిసోడ్‌కు డ్యానియల్ గ్రే లాంగినో దర్శకత్వం వహించాడు. 5వ ఎపిసోడ్‌ను క్లేర్ కిల్నర్ డైరెక్ట్ చేయగా.. 6, 7 ఎపిసోడ్ల డైరెక్షన్ బాధ్యతను ఫ్రెడరిక్ ఈవో టోయ్ డైరెక్ట్ చేశాడు. చివరి ఎపిసోడ్‌కు వెయిన్ యిప్ దర్శకత్వం వహించాడు. 'ఫాల్ ఔట్'లో ఎక్కువ పాజిటివ్‌గా నిలిచిన మరో అంశం ఎల్లా పర్నెల్ నటన. ప్రస్తుతం ఈ సిరీస్ అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమ్ అవుతోంది. ఇంగ్లీష్‌తో పాటు తెలుగులో కూడా 'ఫాల్ ఔట్' అందుబాటులో ఉంది. తెలుగు ప్రేక్షకుల కోసం డబ్బింగ్‌పై కూడా ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకున్నారు.

(గమనిక: వ్యక్తిగత జాతకము అనగా వ్యక్తి పుట్టి నపుడు అతని సమయం, స్థలం, జన్మ వివరాలు ఆధారముగా నిర్మించిన జన్మకుండలి ప్రకారము వ్యక్తికి నడుస్తున్న దశలు, అంతర్దశలు ప్రధానము. గోచారం ఫలితాలు చూసుకునేటప్పుడు ప్రధానముగా వ్యక్తిగత జాతకము లోని దశ అంతర్దశలు కూడా కలిపి చూసుకోవాలి. గోచార రీత్యా రాశి ఫలాలు అశుభము గా ఉండి దోషాలు ఉన్నప్పటికీ, జననకాల దశ ఫలములు శుభము గా ఉంటే రాశి ప్రస్తుత అశుభ ఫలితాలు స్వల్పంగానే ఉంటాయి. చిన్న చిన్న పరిహారాలు పాటించి శుభ ఫలితాలు పొందగలరు)

నిర్వహణ :
స్వర్ణకంకణ సన్మానిత,
జ్యోతిష్య చూడామణి,
జ్యోతిర్వాస్తు ప్రజ్ఞా విశారద
డా॥ఈడ్పుగంటి
పద్మజారాణి



91 9849250852,
91 7506976164
padma.suryapaper@gmail.com

# 28.4.2024 నుంచి 4.5.2024 వరకు



## మేష రాశి

అశ్విని 1,2,3,4 పాదములు , భరణి 1,2,3,4 పాదములు కృత్తిక 1వ పాదము

ఈ రాశి వారికి ఈ వారంఆరోగ్య విషయంలో శ్రద్ధ వహించండి. అజీర్ణ సమస్యలు బాడీ పెయిన్స్ కీళ్ల నొప్పులు కలిగే అవకాశం ఉంది. కుటుంబంలో ఒకరికి ఉపాధి అవకాశాలు కలుగుతాయి అనుకోకుండా దగ్గర బంధువులు సహాయ సహకారాలు అందిస్తారు. ఆకస్మిక ధన లాభం కలుగుతుంది.వృత్తిరీత్యా దూరప్రాంత ప్రయాణం చేయవలసి వస్తుంది .ఆర్థికపరంగా మీరు ఎదురుచూస్తున్న ధనంలో కష్టం మీద కొంత లభిస్తుంది.చాలా కాలంగా మీరు పడుతున్న కష్టనష్టములు నుండి కొంత ఊరట లభిస్తుంది. దైవ బలంతో ఎదురవుతున్న వాటిని జయించండి.వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు గతంలో దూరమైన ఒక మిత్రుడు తిరిగి కలుస్తారు. స్థిరాస్తులు అమ్మే ప్రయత్నం చేస్తారు అయితే వాటికి సరైన ధర రాక వాయిదా వేద్దామనుకుంటారు.



## వృషభరాశి

కృత్తిక 2,3,4 పాదములు ,రోహిణి 1,2,3,4 పాదములు మృగశిర 1,2 పాదములు

ఈ రాశి వారు ఈ వారంలో వ్యక్తిగత ఆకర్షణ గౌరవం పెరుగుతాయి స్థిరాస్తుల పై ఆదాయం పెరుగుతుంది ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు ఆశ్రమాలు సందర్శిస్తారు. అధికారులను కలుసుకుంటారు భార్య లేదా భర్తకు వృత్తిలో అభివృద్ధి కొరకు ప్రయత్నం చేస్తారు.దూర ప్రాంతంలో ఉపాధి కొరకు ప్రయత్నం చేస్తారు ఎలక్ట్రానిక్ వస్తువులు అధిక ఖర్చుతో కొనుగోలు చేస్తారు. ఆరోగ్య విషయంలో వైద్యులు సంప్రదిస్తారు పిల్లల విద్య కొరకు ఎక్కువ ధనం ఖర్చు చేయవలసి ఉంటుంది గతంలో మీ నుండి దూరమైన మిత్రుడు తిరిగి కలుసుకుంటారు. వాహనాలు రిపేర్ చేస్తారు. కుటుంబ ఆదాయం పెరుగుతుంది వివాహ ప్రయత్నాలు చేసే వారికి కాదనుకున్న సంబంధమే తిరిగి వచ్చే అవకాశం ఉంది. కుటుంబంలో శుభకార్యాలు గురించి చర్చిస్తారు



## మిధున రాశి

మృగశిర 3,4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు పునర్వసు 1,2,3 పాదములు

ఈవారం ఈ రాశి వారి గురువులను కలుసుకుంటారు పుణ్య కార్యక్రమాల కొరకు విద్యార్థుల చదువు కొరకు సహాయం చేస్తారు. నూతన ఉపాధి కొరకు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. మీ అదనపు ఆదాయం కొరకు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆత్మీయులు ఒకరు మిమ్మల్ని ఇబ్బందులకు గురి చేసే అవకాశాలు ఉన్నాయి. ముఖ్య వ్యవహారాలు, వివాహ ప్రయత్నాలు ఖర్చులు అవకాశం ఉంది. వివాహ వేడుకల్లో పాల్గొంటారు గృహావసరాలకు అవసరమయ్యే అధునాతన వస్తువులు సమకూర్చుకుంటారు పనివారు ఇబ్బంది పెట్టే అవకాశం ఉంది. జీవిత భాగస్వామి ఆదాయం పెరుగుతుంది. ప్రభుత్వానికి చెల్లించవలసిన బకాయిలు చెల్లిస్తారు అధికారుల నుంచి ఒత్తిడి ఉంటుంది



## కర్కాటక రాశి

పునర్వసు 4వ పాదము పుష్యమి 1,2,3,4 పాదములు ఆశ్లేష 1,2,3,4 పాదములు

ఈవారం ఈ రాశి వారికికుజగ్రహము యొక్క సంచారం వలన స్థిరాస్తుల పై పెట్టుబడి పెట్టటంపై ఆసక్తి చూపిస్తారు. వ్యక్తిగత పనులు తొందరగా పూర్తి చేస్తారు. ప్రారంభంలో విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు ఏర్పడతాయి తండ్రి సమానులు, లేదా ప్రభుత్వం ద్వారా ఆర్థిక సహకారం కలుగుతుంది. ఈ వారం ఆదాయం పెరుగుతుంది. కుటుంబ సభ్యులతో ఆలోచనల్లో అనుకూలత కలిగే అవకాశం ఉంది. పిల్లల విషయంలో ఆదాయ పరముగా శుభవార్తలు వింటారు దగ్గరలో ఉన్న స్నేహితులను కలుసుకుంటారు. కీర్తి విషయంలో ఇబ్బందులు కలుగకుండ జాగ్రత్త పడాలి. కొత్త ఆలోచనలు, వృత్తిలోఅవకాశములు ఏర్పడతాయి. అదనపు ఆదాయం కొరకు ప్రయత్నము చేస్తారు. వ్యాపారం విస్తరణ కొరకు ధనం ఖర్చుపెడతారు.



## సింహ రాశి

మఖ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు ఉత్తర 1వ పాదము

ఈ రాశివారుమంచి గురువు లభించటం వలన అనుకున్న లక్ష్యం పూర్తి చేస్తారు ధైర్యంతో పనులు ప్రారంభిస్తారు. విద్యార్థులకు ఉన్నత విద్యావకాశాలు ఏర్పడతాయి. నూతన వ్యక్తుల కొరకు ధనం ఖర్చు చేసేవారి చేతిలో మోసపోయే అవకాశం ఉన్నది. చాలా కాలంగా ఎదురు చూస్తున్నఆత్మీయులను కలుసుకుంటారు ప్రారంభంలో దాచాలనుకున్నా విషయం బహిర్గతమై ఇబ్బంది కలిగె అవకాశం ఉంది. నూతన ఉపాధి అవకాశాలు కొరకు ప్రయత్నాలు చేస్తారు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు ఏర్పడతాయి. పెద్ద వారి ద్వారా ఆర్థిక సహకారం అందుతుందిఉద్యోగులకు పనిలో ఒత్తిడి బాధ్యతలు పెరిగే అవకాశం ఉంది సంతాన విషయంలో శుభవార్తలు వింటారు. ఇంకా మంచి ఫలితా లు కొరకు హనుమాన్ ఆలయం దర్శించడం మంచి ది



## కన్యా రాశి

ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు చిత్త 1,2 పాదములు

ఈ రాశి వారికి చాలా కాలంగా ఎదురు చూస్తున్న ఒక వార్త వింటారు దూరప్రాంత ప్రయాణం చేయవలసి ఉంటుంది ప్రయాణంలో కొత్త ఆధ్యాత్మిక పరిచయాలు ఏర్పడతాయి దానివలన మంచి ప్రయోజనం ఏర్పడుతుంది. మీ తెలివి తేటలకు గుర్తింపు గౌరవం కలుగుతుంది మనసులో ఉన్న ఆలోచన నిజమయ్యే సూచనలు ఉన్నాయి. ఉద్యోగంలో అభివృద్ధి పై అధికారుల నుండి గుర్తింపు పొందుతారు. కొత్త విషయాలు తెలుసుకుంటారు. వ్యక్తిగత శ్రమ ఎక్కువ ఉంటుంది.ప్రభుత్వ టాక్సులు చెల్లిస్తారు వివాహ ప్రయత్నాలు ఫలిస్తాయి ప్రియమైన వ్యక్తులను కలుసుకుంటారు. కొత్త విషయాలు తెలుసుకుంటారు, ప్రయత్నాలు ఫలిస్తాయి. స్నేహితుల ద్వారా లాభాన్ని పొందుతారు ఒక ముఖ్యమైన శుభకార్యాలలో పాల్గొంటారు అధిక మొత్తంలో ధనాన్ని ఖర్చు చేస్తారు.



## తులారాశి

చిత్త 3,4 పాదములు స్వాతి 1,2,3,4 పాదములు , విశాఖ 1,2,3 పాదములు

ఈ రాశి వారికి మంచి లాభాలతో, చక్కని ఆలోచనా నైపుణ్యములతో ప్రారంభమవుతుంది, చాకచక్యంతో అనుకున్న కార్యక్రమాలు పూర్తి చేస్తారు. విదేశంలో ఉన్నటువంటి మిత్రుల నుండి శుభ సమాచారం అందుకుంటారు కొన్ని సందర్భాల్లో మీరు అనుకున్నవి అన్నీ మీరు అనుకున్న దానికన్నా, ఎక్కువ ఫలితం పొందే అవకాశం ఉంది. అధికారులతో శత్రుత్వం రాకుండా జాగ్రత్తలు పడాలి. ఆత్మీయులు అనుకున్నవారు మీకు మొఖం చాటు చేసే అవకాశం ఉంది. మీరు చెప్పిన విషయాన్ని మీ మిత్రుడు గాని బంధువులగాని అర్థం చేసుకోలేరు మీయొక్క ఆలోచనలకు, అక్కడ జరిగే పనులకు సంబంధం ఉండకపోవచ్చు అయితే చివరకి మీమాటే నెగ్గుతుందిఅత్యంత ఆత్మీయులు తో ఏదో కారణం వల్ల అపార్ధలకి అవకాశం



## వృశ్చిక రాశి

విశాఖ 4 పాదము అనురాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు

ఈ రాశి వారికి ఈ వారంబుుణ ప్రయత్నాలు ఫలిస్తాయి. ముఖ్య విషయంలో ఒక నిర్ణయానికి వస్తారు చాలా కాలంగా వాయిదా పడుతున్న ఒక ముఖ్యమైన పని ఈ వారం లో పూర్తవుతుంది. నిరుద్యోగులకు ఉద్యోగ ప్రయత్నాలు ఫలిస్తాయి విద్యార్థులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. ప్రారంభం గ్రహ మార్పు వల్ల సంతాన విషయంలో శుభవార్తలు వింటారు. వివాహం కాని వారికి కొంతవరకు వివాహ నిశ్చయ అవకాశం ఉంది. రాజకీయ రంగంలో వారికి కొంతమేర కష్టం పైన అనుకూలంగా ఉంటుంది గృహంలో వాతావరణం నీకు అసంతృప్తి. వృత్తిలో మార్పు కొరకు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి భార్య భర్తలు గాని ప్రేమికుల గాని విహార యాత్రకు పెడతారు ఆనందంగా గడుపుతారు. రోజు సూర్య నమస్కారం చెయ్యటం కూడ మంచిదే. ఆదివారం రోజు ఏదైనా ఆలయం దర్శించాలి



## ధనస్సు రాశి

మూల 1,2,3,4 పాదములు పూర్వాషాఢ 1,2,3,4 పాదములు ఉత్తరషాఢ 1వ పాదము

ఈ రాశి వారికి ఈ వారం ప్రారంభంలోఒక ఆధ్యాత్మిక వేత్తను కలుసుకుంటారు వారి నుండి మీ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది దీర్ఘకాలికంగా మీకు వేధిస్తున్నా అనారోగ్య సమస్యల నుండి విముక్తి లభిస్తుంది. శత్రువులపై విజయం లభిస్తుంది. శత్రువులు మిత్రులుగా మారతారు ఎక్కువగా ప్రయాణాలు చేయవలసి వస్తుంది వ్యాపార భాగస్తులు మధ్య విభేదాలు వచ్చే అవకాశం ఉంది. మీ సలహా వలన ఇతరులకి అసంతృప్తి కి అవకాశం ఉంది ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం. స్థిరాస్తి కొనుగోలుకు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి మీ కుటుంబంలో ఒకరికి అనారోగ్యం కలిగే అవకాశం ఉంది అదనపు ఆదాయం కొరకు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి వివాహ వేడుకల్లో పాల్గొంటారు నూతన వస్త్ర వాహన లాభం కలిగే అవకాశం ఉంది



## మకర రాశి

ఉత్తరషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు ధనిష్ఠ 1,2 పాదములు

ఈ రాశి వారికి ఈ వారం చాలాకాలంగా మీ మనసులో ఉన్న కోరిక నెరవేరుతుంది. వాహనాలు నడిపే వారు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. సినిమా టీవీ రంగంలో వారికి అనుకూలంగా ఉంటుంది. ప్రయాణంలో నూతన వ్యక్తుల పరిచయం అవుతారు వారి కొరకు మీరు ధనం ఖర్చుపెడతారు సంతాన విషయంలో శుభవార్తలు వింటారు. వివాహ విషయం వాయిదాపడిన వివాహ ప్రయత్నాలు తిరిగి పున ప్రారంభిస్తారు. అనుకోకుండా వివాహ విషయంమై పెద్దలతో సంప్రదించి ఒక నిర్ణయానికి వస్తారు గృహ వాతావరణం కొంచెం ఘర్షణ. విద్యార్థులు ఉన్నత విద్య కొరకు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. ఆకస్మిక ధన లాభం కలుగుతుంది మీ కుటుంబంలో ఒకరికి దూర ప్రాంతంలో ఉపాధి అవకాశాలు లభిస్తాయి.



## కుంభ రాశి

ధనిష్ఠ 3,4 పాదములు శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు

ఈ రాశి వారు ఈ వారంలోగత కొంత కాలంగా ఆగిపోయిన వృత్తి లేదా వ్యాపారం తిరిగి ప్రారంభించే ప్రయత్నం చేస్తారు. బంధువర్గం నుండి సహాయ సహకారాలు పొందుతారు. తోడబుట్టిన వారికి ఆర్థిక సహాయం అందిస్తారు నిరుద్యోగులకు నూతన ఉపాధి కొరకు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. నూతన వస్తువులు సేకరించే ప్రయత్నం చేస్తారు, కుటుంబ విషయాల్లో ఇతరుల జోక్యం అసహనాన్ని కలిగిస్తుంది. ఒక శుభకార్యం లేదా సమావేశం కొరకు దగ్గర బంధువులు ఆహ్వానిస్తారు. ఉద్యోగస్తులకు పై అధికారుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది సరైన నిర్ణయం తీసుకోలేరు ఏ పని మొదలు పెట్టినా ఆటంకములు ఎదురవుతాయి మధ్యలో ఆగిపోయే అవకాశం ఉంది. పార్ట్నర్స్ తో విరోధం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. .



## మీనరాశి

పూర్వాభాద్ర 4 వ పాదము ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు రేవతి 1,2,3,4 పాదములు

ఈ రాశి వారికి ఈ వారంపదిమందికి ఉపయోగపడే మీ ఆలోచన సంఘంలో పేరు చేస్తుంది ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటారు. మధ్యలో చాలా ప్రోత్సాహకరంగా ప్రారంభమవుతుంది స్నేహితులతో కలిసి ఒక రాజకీయ నాయకులను కలుసుకుంటారు వారి నుండి మీకు కావలసిన పని పూర్తి చేసుకుంటారు. వారి సాయం అనుకున్నట్టు కలుగుతుంది కష్టాల్లో ఉన్న వారిని ఆదుకునే ప్రయత్నం చేస్తారు గౌరవప్రదమైన వ్యక్తిని నమ్మి ఆశభంగము అవకాశాలు. కొత్తగా చేద్దామనుకొని కార్యక్రమాలు వలన ధనం ఖర్చు కలిగే అవకాశం ఉంది నమ్మినవారి చేతిలో ఇబ్బందికి అవకాశం ఉంది. కుటుంబ ఆదాయం పెరుగుతుంది నూతన వస్త్రములు స్త్రీలకు అలంకార వస్తువులు లభించే అవకాశం ఉంది, శుభకార్యాలలో పాల్గొంటారు.

వరలక్ష్మి
శరత్‌కుమార్

